# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్ 18.09.2025 | 24 క్యారెట్లు 11,11.100 | కిలో వెండి 1,42,000 | 24 °C | సంపుటి:3 | సంచిక:262

www.vishalabharati.com





## 'గ్రూప్-1'పై హైకోర్టు డివిజన్ బెంచ్‌కు టీజీపీఎస్సీ

2

# విద్యే ఆయుధం



- భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా
- తెలంగాణ విద్యా విధానం ఉండాలి
- భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేద్న
- జ్ఞానం ఉన్న చోట భాష ఉండటం లేదు
- తెలంగాణ విద్యా విధానంపై నివేదిక
- భారీగా విదేశాల్లో ఉపాధి అవకాశాలు

*క్షేత్ర స్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదని, జ్ఞానం ఉన్న చోట భాష లేదని.. రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవని, కానీ ఈ మూడింటి కలబోతగా విద్య ఉండాలని సీఎం పేర్కొన్నారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై తెలంగాణ సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు సీఎం తెలిపారు. గతంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు భూముల పంపకం, నిధుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టేవని, ఇప్పుడు పంపకానికి భూములు, తగినన్ని నిధులు లేవన్నారు. ఇప్పుడు పేదరిక నిర్మూలనకు విద్య తప్ప మరో ఆయుధం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా రంగం ప్రాధాన్యతను గుర్తించినందునే ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశంలో విశ్వ విద్యాలయాలు, ఐఐటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలను స్థాపించారని గుర్తు చేశారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంలో ఉద్యోగావకాశాలకు అనేక పరిమితులు ఉన్నాయని సీఎం అన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినప్పటికీ విద్యాప్రమాణాలు ఆస్థాయిలో పెరగకపోవడంతో వాటిని అందిపుచ్చుకోవడంలో మనం విఫలమవుతున్నామని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. కాలానుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చినందునే

మిగతా 2లో




## తెలంగాణలో పురుడుపోసుకున్న

# కొత్త పార్టీ

- తీన్మార్ మల్లన్న సంచలన ప్రకటన
- సమావేశంలో పార్టీని ప్రకటించారు
- పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించారు
- ఆత్మగౌరవం, అధికారం, వాటా
- బిగించిన అరచేతి చిహ్నంగా
- రాజకీయ ప్రవేశం 2015లో జరిగింది
- 2024లో కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా

*తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ తన కొత్త రాజకీయ పార్టీకి 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' అనే పేరును ఖరారు చేశారు. హైదరాబాద్ లోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో పార్టీని ప్రకటించారు. పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించారు.. జెండా పైభాగంలో ఎరుపు రంగు, కింది భాగంలో ఆకుపచ్చ రంగు ఉన్నాయి. జెండా మధ్యలో కార్మిక చక్రాన్ని, దాని నుంచి పైకి లేస్తున్నట్లుగా పిడికిలి బిగించిన అరచేతి చిహ్నంగా పొందుపరిచారు. జెండాపై 'ఆత్మగౌరవం, అధికారం, వాటా' అనే నినాదాన్ని ముద్రించారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తీన్మార్ మల్లన్న అసలు పేరు చింతపండు నవీన్ కుమార్. ఆయన మొదట జర్నలిస్ట్‌గా పని చేశారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. రాజకీయ ప్రవేశం 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2021 డిసెంబర్ 7న భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. 2023 నవంబర్ 8న మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి చేరారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్ రావు థాక్రే సమక్షంలో చేరారు. 2024లో కాంగ్రెస్

మిగతా 2లో

# హాలీవుడ్ స్థాయికి హైదరాబాద్

- చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం
- కార్మికులు సమస్యలపై చర్చించాలి
- కార్మికులను విస్మరించవద్దు
- నైపుణ్యాల పెంపుకు సహకరించాలి
- స్కిల్స్ యూనివర్సిటీలో శిక్షణ
- అన్ని భాషల చిత్రాలు షూటింగ్



*చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో హైదరాబాద్ ను హాలీవుడ్ స్థాయికి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులు తమ సమస్యలపై చర్చించుకుని ఏం కావాలో ప్రభుత్వానికి తెలియజేయాలని చెప్పారు.*

2

# జీతాలు తగ్గడం లేదుగా

- హైడ్రాలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు
- జీతాలు ఏమీ తగ్గడం లేదన్న హైడ్రా
- మ్యాచింగ్ గ్రాంట్‌గా అందజేయాలి
- ఫండ్ రావడం కాస్త ఆలస్యం అయ్యింది
- ఏవీ రంగనాథ్ చర్చలు జరిపారు

*హైడ్రాలో ఔట్ సోర్సింగ్ (ఒప్పంద కార్మికులు) ద్వారా పని చేస్తున్న ఉద్యోగుల జీతాలు ఏమీ తగ్గడం లేదని హైడ్రా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 1272 ప్రకారం జీహెచ్ ఎంసీలోని ఈవీడీఎం ద్వారా హైడ్రాకు సమకూరిన ఉద్యోగుల జీతాలు రాష్ట్రంలోని వేరే డిపార్ట్‌మెంట్స్‌లో పనిచేస్తున్న

మిగతా 2లో



# కమిషన్ల కోసం కక్కుర్తి

- ఎల్ అండ్ టీ సీఎం బెదిరింపులు
- కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు
- రేవంత్ రెడ్డిపై సంచలన ఆరోపణలు
- ముఖ్యమంత్రి ముడుపుల కోసం
- కంపెనీ రాష్ట్రం నుంచి పారిపోతుంది
- బాధ్యత లేకుంగా వ్యవహరిస్తున్నారు
- సీఎం కమిషన్ తీ్నకున్నారు

*ముఖ్యమంత్రి బెదిరింపులు తట్టుకోలేకనే హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి ఎల్ అండ్ టీ తప్పుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆయన రేవంత్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి ముడుపుల కోసం వేధిస్తున్న వేధింపులు తట్టుకోలేకనే కంపెనీ రాష్ట్రం నుంచి పారిపోతున్నదని.*

2

## ప్రభుత్వం కూలడం ఖాయం



- నిరుద్యోగులు అధైర్య పడకండి
- నిరసనలు ధర్నాలు మానుకోండి
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి
- అవసరమైతే అశోక్ నగర్‌కి వస్తా
- నిరుద్యోగులతో పెట్టుకోకూడదు
- నేపాల్ తరహాలో యువత
- అమరవీరుల స్థూపానికి నివాళి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నిరుద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని ఆయన అన్నారు. నేపాల్ తరహాలో యువత తిరగబడితే ప్రభుత్వం

మిగతా 2లో

*నిరుద్యోగులు అధైర్య పడకండని.. నిరసనలు ధర్నాలు మానుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సూచించారు. నిరుద్యోగుల సమస్యలు వినడానికి అవసరమైతే అశోక్ నగర్ చౌరస్తాకి, సెంట్రల్ లైబ్రరీకి దిల్‌సుఖ్‌నగర్‌కు తానే వస్తానని హామీ ఇచ్చారు.*

# దంచికొట్టిన వాన

- హైదరాబాద్ నగరంలో భారీ వర్షం
- రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు
- ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్
- వాహనదారులు తీవ్ర ఇబ్బందులు
- ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

2

*హైదరాబాద్ నగరంలో పలు చోట్ల భారీ వర్షం దంచికొడుతోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఫిల్మ్‌నగర్, టోలీచౌకీ, గచ్చిబౌలి, మియాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, మల్లాపూర్, హఫీజ్‌పేట్, సరూర్‌నగర్, కార్వాన్, చాంద్రాయణగుట్ట, సైదాబాద్, బండ్లగూడ, మణికొండ, కొండాపూర్, షేక్‌పేటలో వర్షం కురుస్తోంది. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ స్తంభించింది.*






# తెలంగాణలో పురుడుపోసుకున్న కొత్త పార్టీ

మొదటి పేజీ తరువాయి

పార్టీ నుండి పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అయితే, కులగణనపై దారుణమైన విమర్శలు చేయడంతో 2025 ఫిబ్రవర్ 5న కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ అయ్యారు. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలు చేస్తూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆయన సమాధానం ఇవ్వకపోవడంతో సస్పెన్షన్ వేటు వేశారు. తన కొత్త పార్టీ బీసీ సమాజాన్ని ఏకం చేసి, వారి రాజకీయ, ఆర్థిక హక్కుల కోసం పోరాడే ప్లాట్‌ఫారమ్‌గా రూపొందించానని అంటున్నారు. బీసీల చేతిలో భూములు, సంపద మ, జకీయ అధికారం అమలు చేయడం లక్ష్యమని చెబుతున్నారు. "తెలంగాణ గడ్డ మీద బీసీలు తమకు తాముగా ఒక రాజకీయ పార్టీని తీసుకొచ్చామని బీసీలు ఏకం చేసి, వారి హక్కుల కోసం పోరాడతాము." అని ప్రకటించారు. అయితే మల్లన్న పార్టీ పెట్టడం ఇదే మొదటి సారి కాదు. 2023లో 'తెలంగాణ నిర్మాణ పార్టీ' పేరుతో కొత్త పార్టీ ప్రకటించారు, కానీ అది ముందుకు సాగలేదు. ఇప్పుడు బీసీ ఎజెండాతో కొత్తగా ప్రయత్నిస్తున్నారు. తీన్మార్ మల్లన్న రాజకీయంగా ముఖ్యమంత్రి స్థానాన్నిపొందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో బీసీ సంఘాల కోసం సభలు నిర్వహించారు. ఇప్పుడు నేరుగా పార్టీ పెట్టడం ద్వారా.. బీసీల్లోని అన్ని కులాలను ఏకంగా చేసి ఆయన రాజ్యాధికారం చేపట్టాలని అనుకుంటున్నారు.

# హాలీవుడ్ స్థాయికి హైదరాబాద్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధులు, సభ్యులు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. కార్మికుల సంక్షేమం కోసం సినీరంగ కార్మికులకు ఏమి కావాలో చర్చించుకుని ప్రభుత్వానికి తెలియజేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ వారితో వివరంగా చెప్పారు. ఇటీవల నిర్మాతలతో జరిగిన సమావేశంలో సినిమా కార్మికులను విస్మరించవద్దని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సినిమా కార్మికులలో నైపుణ్యాల పెంపుకు సహకరించాల్సిందిగా నిర్మాతలను కోరానని చెప్పారు. చలనచిత్ర రంగంలో కార్మికులు నైపుణ్యాలను పెంచుకోవలసిన అవసరం ఉందని, అందుకోసం స్కిల్స్ యూనివర్సిటీలో సినిమా కార్మికుల శిక్షణ అందించే కార్యక్రమం చేపడతామని అన్నారు. అన్ని భాషల చిత్రాలు తెలంగాణలో షూటింగ్ జరిగేలా అందరూ సహకరించాలని, ఈ విషయంలో ముఖ్యంగా చిన్న సినిమా నిర్మాతలకు సహకరించాలని చెప్పారు. చిత్ర పరిశ్రమలో సానుకూల పని వాతావరణాన్ని చెడగొట్టుకుని సమ్మెలకు వెళ్లడం వల్ల రెండు వైపులా నష్టం జరుగుతుందని వివరించారు. సినిమా కార్మికుల తరఫున నిర్మాతలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని చెప్పారు. ప్రభుత్వం సమస్యలను సమస్యలుగానే చూస్తుందని, వ్యక్తిగత పరిచయాలు ప్రధానం కాదని స్పష్టం చేశారు. సినీ కార్మికుల సమస్యలను పరిష్కరించే బాధ్యతను తీసుకుంటానని, ఈ విషయంలో తాను కార్మికుల పక్షాన ఉంటానని చెప్పారు. అయితే రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంటుందని వివరించారు. సమ్మె జరుగుతుంటే ప్రభుత్వం నిర్లిప్తంగా ఉండలేదని స్పష్టం చేశారు. అంతకుముందు పదేళ్ల పాటు సినిమా రంగంలో అవార్డులు ఇవ్వని అంశాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తూ తమ ప్రభుత్వం సినీ కళాకారులకు గద్దర్ అవార్డులను బహూకరించిన విషయాన్ని వివరించారు. అదే క్రమంలో సినిమా కార్మికులకు ఆరోగ్య బీమా అందించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. గడిచిన ఎన్నో ఏళ్లుగా సినిమా కార్మికులను పిలిచి మాట్లాడిన ముఖ్యమంత్రి లేరని ఈ సందర్భంగా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


# జీతాలు తగ్గడం లేదుగా

మొదటి పేజీ తరువాయి

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు సమానంగా సవరించడం జరిగింది. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి హైడ్రా తీసుకెళ్లింది. ఆ వ్యత్యాసం మొత్తాన్ని జీహెచ్ఎంసీ నుంచి మ్యాచింగ్ గ్రాంట్‌గా అందజేయాలని ప్రభుత్వం సూచించింది. ఆ మ్యాచింగ్ ఫండ్‌తో మొత్తం జీతం చెల్లించడానికి హైడ్రా ప్రయత్నించింది. అయితే ఆ మ్యాచింగ్ ఫండ్ రావడం కాస్త ఆలస్యం అయ్యింది. స్టాండింగ్ కమిటీ ఆమోదం తర్వాత మ్యాచింగ్ ఫండ్ విడుదల చేస్తామని జీహెచ్ఎంసీ తెలిపింది. ఉద్యోగులు జీతాలు లేక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో జీవో 1272 ప్రకారం వెంటనే జీతాలు హైడ్రా చెల్లించింది. వ్యత్యాసం మొత్తాన్ని త్వరలో సర్దుబాటు చేస్తామని కూడా చెప్పింది. అయితే కొంతమంది ఉద్యోగులు జీతాలు తగ్గినట్టు భావించి బుధవారం ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఉద్యోగులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చర్చలు జరిపారు. జీతాలు తగ్గవని.. జీహెచ్ ఎంసీ నుంచి మ్యాచింగ్ గ్రాంట్ రిలీజ్ అవ్వగానే సర్దుబాటు చేస్తామని హామీ ఇవ్వడంతో హైడ్రాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఊరట చెందారు. వెంటనే విధుల్లోకి చేరారు. వారికి జీహెచ్ ఎంసీలో ఈవీడీఎం భాగంగా ఉన్నప్పుడు అందిన జీతాలే ఇప్పుడు కూడా చెల్లించడం జరుగుతుందని హైడ్రా ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

# ప్రభుత్వం కూలడం ఖాయం

మొదటి పేజీ తరువాయి



కూలడం ఖాయమంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగులను గాలికి వదిలేకూడదని.. వాళ్ల మన పిల్లలు అని ప్రభుత్వానికి సూచించారు. వారికి దారిచూపించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉందన్నారు. యువత అనుకుంటే సాధించలేనిది ఏమి లేదన్నారు. నిరుద్యోగుల ఆహ్వానం మేరకు హైదరాబాదులోని గన్ పార్క్‌లో నిరుద్యోగులతో కలిసి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరుద్యోగులు పోషించిన పాత్ర వెలకట్టలేనిదన్నారు. పదేళ్లలో నిరుద్యోగుల కలలు కల్లలుగానే మిగిలిపోయాయని.. బీఆర్ఎస్ పాలనలో ఒక గ్రూప్ వన్ కూడా వేయలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలన కుటుంబ పాలనగా కొనసాగి అవినీతిమయంగా మారి దోచుకుని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. "తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఏ ఒక్కరికి న్యాయం జరగలేదు. తెలంగాణ యువత కేసీఆర్‌ను ఫామ్ హౌస్‌కు పంపించడానికి పోషించిన పాత్ర అమోఘమైనది. ప్రజా ప్రభుత్వం వచ్చాక 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం.. నిరుద్యోగులకు అండగా ఉంటా అధైర్య పడకండి. చిన్నాభిన్నమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే ప్రయత్నం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. పేదల ప్రభుత్వం ఇది ప్రజల ప్రభుత్వం సెప్టెంబర్ 17ను కూడా ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకుంటున్నాం. సోనియాగాంధీ కలలు కన్న తెలంగాణ రాష్ట్రం పదేండ్ల కాలంలో సహకారం కాలేదు. రాబోయే రోజుల్లో మీ అందరికీ ఉద్యోగాలు వస్తాయి. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం అనేది సాధ్యమయ్యే పని కాదు అయినా ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు చదువుకున్న యువత తమ కాళ్ళ మీద నిలబడేలా ఉపాధి మార్గాలు చూపిస్తాం. మీకు న్యాయం జరిగే వరకూ మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.. ప్రభుత్వానికి నిరుద్యోగులకు మధ్య వారధిగా పని చేస్తా.. నిరుద్యోగులకు ధైర్యం చెప్పడానికి ఇక్కడికి వచ్చా... నిరుద్యోగులు అధైర్య పడకండి. మీ సమస్యలు వినడానికి అవసరమైతే సెంట్రల్ లైబ్రరీకి, అశోక్ నగర్ చౌరస్తాకి, దిల్‌సుఖ్‌నగర్‌కు వస్తా.. నిరసనలు నిర్బంధాలు ధర్నాలు అవసరం లేదు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం మీ సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.." అని రాజగోపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు.


విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం
18.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## 'గ్రూప్-1'పై హైకోర్టు డివిజన్ బెంచ్‌కు టీజీపీఎస్సీ

**హైదరాబాద్:** గ్రూప్ 1 అంశంపై హైకోర్టు డివిజన్ బెంచ్‌ను టీజీపీఎస్సీ బుధవారం ఆశ్రయించింది. ఇంతకు ముందు సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది. గ్రూప్ 1 ఫలితాలు, ర్యాంకులు రద్దు చేస్తూ ఈ నెల 9న హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి మార్చి 10న విడుదల చేసిన ఫలితాలను, మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకులను రద్దు చేస్తూ జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు నేతృత్వంలోని హైకోర్టు సింగిల్ బెంచ్ సంచలన తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా ఇచ్చిన ఆదేశాల్లో... టీజీపీఎస్సీకి రెండు ఆప్షన్లను ఇచ్చింది. ఒకటి.. మెయిన్స్ జవాబు పత్రాలను ఎలాంటి అవకతవకలు లేకుండా రీవాల్యుయేషన్ చేయాలి. సంజయ్‌సింగ్ వర్సెస్ యూపీఎస్సీ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాల ప్రకారం మాన్యువల్(సాధారణ పద్ధతి)గా మూల్యాంకనం చేసి, ఆ ఫలితాల ఆధారంగా 563 పోస్టులను భర్తీ చేయాలి.

# విద్యే ఆయుధం: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి



పెద్ద సంఖ్యలో సాఫ్ట్ వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారని సీఎం తెలిపారు. అయినప్పటికీ మన రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆ రంగంలో నైపుణ్యాలు పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు.

విద్యా రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా ఏటికేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రైవేటు పాఠశాలలు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీతో ప్రారంభిస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రారంభమవుతున్నాయన్నారు. నర్సరీకి ప్రైవేటు పాఠశాలలో చేరిన వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు చూడడం లేదన్నారు. విద్యార్థుల రాకపోకలు, తగిన శ్రద్ధ చూపుతారనే కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారని సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ఆ రకమైన ధీమా కల్పించగల్గితే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చుతారని.. తెలంగాణ విద్యా విధానం రూపకల్పనలో ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సీఎం సూచించారు. ఇప్పటి వరకు విద్యా రంగంపై తాము చేసిన కృషితోనే తాము సంతృప్తి చెందడం లేదని.. ప్రాథమిక దశ నుంచి యూనివర్సిటీల వరకు సమూల ప్రక్షాళన చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని సీఎం అన్నారు. డిసెంబరు 9వ తేదీన ఆవిష్కరించనున్న తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని సీఎం వెల్లడించారు. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలుగా విభజించుకొని ఇందులో ఉన్న విద్యావేత్తలు తమ అభిరుచులకు అనుగుణంగా సబ్ కమిటీలుగా ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలని సీఎం కోరారు.

తెలంగాణ విద్యా విధానం ఛైర్మన్ కేశవరావు మాట్లాడుతూ విద్యా కమిషన్, ఇతర భాగస్వాములతో తాము విస్తృత సంప్రదింపులు చేశామన్నారు. గణాంకాల కన్నా నాణ్యత ప్రధానమని, విద్యార్థి కేంద్రంగా బోధన ఉండాలనేది తమ అభిప్రాయమన్నారు. ఏఐ వంటివి ఎన్ని వచ్చినా అవి గురువుకు ప్రత్యామ్నాయం కావన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు దేశ యువతలో మూడోవంతు నీట్ గా ఉన్నారని, దాని అర్థం నాట్ ఇన్ ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ అని ఓ సర్వే తేల్చిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల పెంపునకు చేసిన కృషి అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సేవలను విద్యా రంగానికి వినియోగించుకోవాలని, విద్యా వలంటీర్ గా వినియోగించుకోవాలని కోరారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్ మూర్తి తాము స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామని, ఒక్క ఏడాదిలో 180 పేటెంట్లు పొందామని సీఎం తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ విద్యా విధానం కొలువుల సాధనకే కాకుండా అత్యుత్తమ మానవునిగా తీర్చిదిద్దేదిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎమ్మెల్సీలు ఏ.వి.ఎన్.రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, విద్యావేత్తలు మోహన్ గురుస్వామి, ప్రొఫెసర్ సుబ్బారావు, సీఐఐ శేఖర్ రెడ్డి, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, అక్షరవనం మాధవరెడ్డి, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, ఫ్రొపెసర్ గంగాధర్, విశ్రాంత ఐఏఎస్‌లు మిని మాథ్యూ రంజీవ్ ఆచార్య, ప్రొఫెసర్ శాంతా సిన్హా తదితరులు మాట్లాడారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, అధికారులు జయేశ్ రంజన్, శ్రీదేవసేన, కృష్ణ ఆదిత్య, నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# కమిషన్ల కోసం కక్కుర్తి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని తమ కార్యకలాపాల నుంచి ఎల్ అండ్ టీ తప్పుకుంటోందన్నారు. గతంలో ఎల్ అండ్ టీ సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ని జైల్లో పెడతా అన్నాడని గుర్తు చేశారు. వాళ్లని వీళ్ళని జైల్లో పెడతా అంటే ఇలాంటి దుర్మార్గమైన ఫలితాలు వస్తాయని.. రాష్ట్ర ప్రభుత్వానికి బాధ్యత లేకుండా వ్యవహరిస్తే ప్రైవేట్ కంపెనీలకు ఎందుకు ఉంటుందని కేటీఆర్ ప్రశ్నించారు. త్వరలోనే గతంలో అనేక వివాదాలు ఉన్న ఎమ్మార్ సంస్థ యొక్క ఆస్తులను రేవంత్ రెడ్డి అమ్మ బోతున్నాడని.. ఇందులో ఎంత కమిషన్ తీసుకున్నాడు అనేది తెలుస్తామన్నారు. గతంలో అనేక కంపెనీలపై ఉన్న కేసులను.. ముందు పెట్టి ఆయా కంపెనీలతో సెటిల్మెంట్లు చేసుకుంటున్నాడని.. అన్ని కంపెనీల నుంచి ముడుపులు తీసుకొని భారీగా వసూళ్లకు రేవంత్ రెడ్డి తెగబడుతున్నాడని ఆరోపించారు. కనీసం గ్రూప్ వన్ అభ్యర్థులు, విద్యార్థులు రౌండ్‌టేబుల్ సమావేశం కూడా పెట్టుకోలేని పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. స్కూల్‌లు, కాలేజీలు బంద్, ఆరోగ్యశ్రీ సేవల రద్దుతో హాస్పిటల్‌లు యూరియాతో ఆగిపోయాయి. ఆశ వర్కర్లకు సంబంధించి, రేషన్ డీలర్లకు సంబంధించిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈరోజు సచివాలయానికి రావడం లేదు.. గతంలో ప్రజా భవన్ గురించి అనేక అబద్దాలు మాట్లాడినాడు అసలు రాష్ట్ర ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌కి వస్తున్నాడా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ బీసీలను మోసం చేస్తున్నారని కరాకండిగా చెబుతున్నామని.. ముందు నుంచే కూడా రేవంత్ రెడ్డి మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాడన్నారు. తనపైన ఉన్న వ్యక్తిగత కోపాన్ని రేవంత్ రెడ్డి సిరిసిల్ల నేతన్నలపైన చూపిస్తున్నాడని.. సిరిసిల్ల నేతన్నల పొట్ట కొట్టి మొత్తం పరిశ్రమను అంతలాకులం చేశాడని ఆరోపించారు. 12 వేల కోట్లు డ్రగ్స్ దొరికితే రాష్ట్ర ముఖ్యమంత్రికి కనీసం సమాచారం లేదని.. ఇంత పెద్ద అరాచకం రాష్ట్రంలో నడుస్తుంటే ఈగల్ టీం, హైడ్రా అంటూ ఎందుకు తమాషాలు చేస్తున్నారని ప్రశ్నించారు. అసలు ఇప్పటిదాకా హైడ్రా చేసిన పని ఏమిటి? మరి ఇవన్నీ చేస్తే వర్షం వచ్చేటప్పుడు హైదరాబాద్ నగరం ఎందుకు మునిగిపోతుందో చెప్పాలన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల పరిస్థితి కుడితిలో ఎలుకలమాదిరి మారిందన్నారు. మా పార్టీ నుంచి చేరిన నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుల పరిస్థితి చూస్తే జాలి కలుగుతుందని.. కాంగ్రెస్ పార్టీ అధికారం రావడానికి కొట్లాడిన ప్రతి ఒక్కరు.. ఆ పార్టీ నియోజకవర్గాల్లో దారుణంగా మోసపోయారన్నారు. నిజంగా రాష్ట్రంలో అద్భుత పాలన ఉంటే వెంటనే ఉప ఎన్నికలు పెట్టాలని సవాల్ చేశారు. బిఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ బీ-ఫారమ్‌తో పోటీ చేసిన దానం నాగేందర్ స్పీకర్ ఇంకా చెప్పేది ఏముందని ప్రశ్నించారు. రీజినల్ రింగ్ రోడ్ అలైన్మెంట్ మా ప్రభుత్వం ఉన్నప్పుడు రూపొందించడం జరిగింది... కానీ దాన్ని పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత ప్రయోజనాల కోసం మార్చుతోందని.. ఫోర్త్ సిటీ దగ్గరలో ఉన్న తమ భూముల కోసం అలైన్మెంట్ మాత్రం రీజినల్ రింగ్ రోడ్ స్వరూపం మారిపోయిందన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు అమలుకు డబ్బులు లేవంటున్న ప్రభుత్వం, రీజినల్ రింగ్ రోడ్ కోసం మాత్రం తమ భూముల్లో లాభం జరగడం కోసం భూములు కడతామని చెబుతోంది. రీజినల్ రింగ్ రోడ్డుకి, ఫోర్త్ సిటీకి మధ్యలో వేస్తున్న రోడ్ కేవలం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యుల భూముల కోసం వేస్తున్నారు. ఈ రోడ్డు వెంబడి అనేక మందితో భూములు కొనుగోలు చేసి ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు.

# దంచికొట్టిన వాన



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నగరంలో రోడ్లన్నీ జలమయంగా మారాయి. దీంతో జీహెచ్ఎంసీ, హైడ్రా బృందాలు అప్రమత్తమయ్యాయి. మ్యాన్ హోల్స్ దగ్గర అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. నగరంలో భారీ వర్షపాతం నమోదైంది. మియాపూర్ 9.7 సెం.మీ, లింగంపల్లి 8.2, హెచ్‌సీయూ 8.1, గచ్చిబౌలి 6.6, చందానగర్ 6.4, హఫీజ్‌పేట్ 5.6, ఫతేనగర్ 4.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం తెల్లవారుజామున నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. నాలుగున్నర ప్రాంతంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, పంజాగుట్ట, యూసఫ్‌గూడ, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. అరగంటపాటు కురిసిన వర్షంతో నగర రహదారులు జలమయయ్యాయి. ఆ సమయంలో వాహనాల రద్దీ లేకపోవటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఇక కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ మేరకు ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్‌లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. విజయవాడలో కూడా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. భారీ వర్షం కురుస్తోంది. పశ్చిమమధ్య,ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతం వరకు తూర్పు విదర్భ, తెలంగాణ మరియు దక్షిణ కోస్తాంధ్ర మీదుగా సముద్ర మట్టానికి సగటున 0.9 కి.మీ ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు రాయలసీమలో ఒకటి, రెండు చోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల క్రింద నిలబడరాదని సూచించారు. కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్నిప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు ప్రకాశం జిల్లా ఒంగోలులో 64.5మిమీ, కె.ఉప్పలపాడులో 53.5మిమీ, వేములపాడు 47మిమీ, చిలకపాడులో 45మిమీ, విజయనగరం జిల్లా రాజాంలో 40.2మిమీ, కాకినాడలో 39మిమీ వర్షపాతం రికార్డు అయిందన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం
18.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



**మునుగోడు, విశాలభారతి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయలలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజాం పాలనలో రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన అమర వీరులను స్మరించుకోవాలని, స్వేచ్ఛా గగనాన్ని తెలంగాణ ప్రజలకు అందించిన వీరయోధులకు వందనాలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నేలపట్ల నరేష్, ఎంపీడీవో యుగంధర్ రెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు



## మహిళా పోలీసుల అవగాహన కార్యక్రమం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

రాచకొండ పోలీస్ కమిషనర్ పి. సుధీర్ కుమార్ ఆదేశాల మేరకు నాగోల్ డివిజన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్స్పెక్టర్ మహమ్మద్ మాక్బుల్ జానీ ఆధ్వర్యంలో బుధవారం విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు సైకిళ్లపై వీధుల గుండా తిరుగుతూ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యారు. స్థానిక మహిళలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా గృహహింస, వేధింపులు, వీధుల్లో అవాంఛనీయ ప్రవర్తన, మద్యం మత్తులో అల్లర్లు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. "మీకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెనుకాడకుండా వెంటనే పోలీసులకు సమాచారం చేరవెయ్యాలని. మేము ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటాము, రక్షణ కల్పిస్తాము" అని మహిళా పోలీసులు భరోసా ఇచ్చారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, డయల్ 112 సేవలను, అలాగే షీ టీమ్స్ వంటి ప్రత్యేక విభాగాలను వినియోగించుకోవాలని సూచించారు. చిన్నారులు, బాలికలపై జరిగే వేధింపులు, దాడుల వంటి విషయాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు, ప్రజలు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు తరచూ జరిగితే ప్రజల్లో భద్రతాభావం మరింత పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# బోర్డు తిప్పేసిన మరో రియల్ ఎస్టేట్ కంపెనీ

### కృతిక ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీ ఎండీ దుమావత్ శ్రీకాంత్ అరెస్ట్

### ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో భారీ మోసం

### మూడు ప్రాజెక్టుల పేరుతో రూ. వందల కోట్లు

### ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ముందు క్యూ కట్టిన బాధితులు




**ఎల్బీనగర్, విశాలభారతి:**

ఎలాంటి అర్హతలు లేకపోయినా ప్రతిఒక్కరూ రియల్ ఎస్టేట్ పేరిట బోర్డులు ఏర్పాటు చేయడం..అమాయక ప్రజల నుంచి ప్లాట్ల పేరిట వసూలు చేయడం కోట్లల్లో వసూలయిన తర్వాత బోర్డు తిప్పేసి పరారు కావడం.. ఇదంతా నిత్య కృత్యంగా మారింది. చివరకు బెయిల్ పై బయటకు వచ్చి జల్సాలు చేయడం అలవాటు అయ్యిపోయింది. అమాయక ప్రజలు మోసం గ్రహించి లబోదిబోమనడం ఇదంతా నయా ట్రెండ్‌గా మారింది. అలాంటి ఘటన ఎల్బీనగర్‌లో వెలుగులోకి వచ్చింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు కార్పొరేట్ స్థాయిలో కార్యాలయాలు ఏర్పాటు చేసి హంగు ఆర్భాటాలు చేస్తారు. వీరు జీవనోపాధికోసం ఉద్యోగం వెతికే వారి బలహీనత గమనించి ఏజెంట్లుగా నియమించుకున్నారు. వారికి రంగురంగుల బ్రోచర్లు ఇచ్చి మార్కెట్ చేయించి కోట్ల రూపాయలు వసూలు చేశారు. డబ్బులు కట్టిన వారికీ స్థలం రిజిస్ట్రేషన్ చేయకపోవడం వల్ల వారు పోలీసులను ఆశ్రయించగా సంస్థ బోర్డు తిప్పేశారు. క్రితిక ఇన్ ఫ్రా డెవలపర్స్ ఎండి దుమావత్ శ్రీకాంత్ నాయక్ మాయమాటలకు సుమారు 60 మంది బాధితులు వెలుగులోకి వచ్చారు. వారి నుండి దాదాపు రూ. 80 కోట్లకు పైగానే వసూలు చేసినట్లు తెలిసింది. బోడుప్పల్, తట్టి అన్నారం, ఆదిభట్ల తదితర ప్రాంతాలలో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇస్తామని ఒక్కొక్కరి వద్ద రూ. 50 లక్షలు నుండి కోటి రూపాయల వరకు కట్టించుకున్నారు. రెరా చట్టం నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా ఫ్రీ లాంచ్ పేరిట దోపిడి చేశారు. కస్టమర్లను ఎంతకు పొజిషన్ ఇవ్వకపోవడం వల్ల మోసపోయినట్లు గ్రహించి బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఎండి శ్రీకాంత్‌పై ఎల్బీనగర్, వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లలో 16 కేసులు నమోదయ్యాయి. శ్రీకాంత్ అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది.



## త్వరలోనే చెంగిచెర్ల -చర్లపల్లి రోడ్డు పనులు ప్రారంభం

**బోడుప్పల్, విశాలభారతి:**

చెంగిచెర్ల నుండి చర్లపల్లి ప్రధాన మార్గంలో గతంలో ప్రారంభించి వదిలేసిన రోడ్డు పనులు తిరిగి ప్రారంభం కానున్నాయని బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలిపారు. బుధవారం నాడు %ఎ=ణజూ% అధికారులు (ఈఈ విఠలయ్య ,(డీఈ) విక్రమ్ ల అధ్వర్యంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం అజయ్ యాదవ్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా చెంగిచెర్ల-చర్లపల్లి రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండిపోయాయని అన్నారు. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గారి చొరవతో అధికారులు ఈ రోజు రోడ్డును పరిశీలించి త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, కో ఆప్షన్ మాజీ సభ్యులు రంగ బ్రహ్మన్న గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జనం మెచ్చిన జన నాయకుడు మోడీ

**తొర్రూర్, విశాలభారతి:**



నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం. భారతీయ జనతాపార్టీ ( బీజేపీ) ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ మరియు ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక గెస్ట్ హౌస్ వద్ద ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ విమోచన దినం అని, నిజాం రజాకార్ల నిరంకుశ పాలన అంతమై తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన రోజు అని, పాలకుర్తి నియోజకవర్గంలో దయాకర్ రావు దొర పాలన అంతమై దాదాపు రెండేళు దగ్గరికొచ్చిందని కానీ పాలకుర్తి నియోజకవర్గంలో దొరల పాలన పోయి దొరసాని పాలన వచ్చిందని, నియోజకవర్గ ప్రజలకు ఇంకా స్వేచ్ఛ లభించలేదని, ఇంకా భానిస బ్రతుకు పోలేదని, పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఈ దొర దొరసాని పాలన నుండి విముక్తి కల్పించేందుకు బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోడి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేసిన వారిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోడీ జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని కొనియాడారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ పురోగతి సాధిస్తోంది అని, నరేంద్ర మోడీ నాయకత్వమే ఈ దేశానికి శ్రీరామరక్ష అని తెలిపారు. కరోనా విపత్తు వేళా ప్రపంచం మొత్తం అతలాకుతలం అయితే ప్రపంచం మొత్తం కరోనా నివారణ మందులు అందించి భారత్ ను విశ్వ గురువు స్థానం లో నిలిపారు అని కొనియాడారు. మోడీ జన్మదినం సెప్టెంబర్ 17నుండి గాంధీ జయంతి అక్టోబర్ 2 వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్, రంగు రాములు, తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, రూరల్ మండలం అద్యక్షుడు గట్టు రాంబాబు, పెద్దవంగర మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరా చారి, జిల్లా, మండల , వివిధ మోర్చాల బాధ్యులు కొలుపుల శంకర్, ఆలిసేరి రవిబాబు, గడల శేఖర్, ఆర్. రాజకుమార్, కాగు నవీన్, గంధం రాజు తదితరులు పాల్గొన్నారు.



## పెరేడ్ గ్రౌండ్‌కి బయలుదేరిన బీజేపి శ్రేణులు

**కూకట్ పల్లి, విశాలభారతి:**

నగరంలోని తెలంగాణ విమోచన దినోత్సవ సందర్భంగా జింఖాన పరేడ్ గ్రాండ్ లో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్, ఫతేనగర్ డివిజన్ నుండి బీజేపి సీనియర్ నాయకులు కంచి మహేందర్ ఆధ్వర్యంలో భారీగా శ్రేణులు తీరని వెళ్ళారు. ఈ నేపథ్యంలో మంచి మహేందర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి కలిగిన రోజని కానీ సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవమని జరుపుకోవడం సిగ్గుచేటు అని తెలిపారు. ఎం ఐ ఎం వారి మెప్పుకోసమే ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని జరుపుకోవడం లేదని విమర్శించారు. నైజాం పాలకుల నుండి విముక్తి కలిగిన ఈ రోజుని తెలంగాణ ప్రజలందరూ జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రమేష్, డాక్టర్ కిరణ్, యాదగిరి శివరంజని బీజేపీ నాయకులు కార్యకర్తలు తీరని వెళ్ళారు.

# ప్రధాని జన్మదినాన్నీ పురస్కరించుకుని రక్తదాన శిబిరం

**రాజేంద్రనగర్, విశాలభారతి:**




తెలంగాణ విమోచన దినోత్సవం మరియు దేశ ప్రియతమా ప్రధాని గౌరవనీయులైన "భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ చౌరస్తా బస్ స్టాప్ వద్ద నిర్వహించిన బ్లడ్ క్యాంప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి ముందుగా జాతీయ జెండా ఆవిష్కరించి, అనంతరం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అందరికీతెలంగాణ విమోచన దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది అనంతరం భారత దేశనీ ప్రపంచం లోనే విశ్వ గురువు గా తీర్చి దిద్దడానికి తన జీవితం అహర్నిశలు కృషి చేస్తున దేశ ప్రియతమా ప్రధాని నరేంద్ర మోదీ గారి 75 వ జన్మదినాన్ని పురస్కరించుకొని వారికి దేవుని చల్లని ఆశీస్సులు దీవెనలతో నిండు నూరేళ్ళు ఆయురోగ్యాలతో ఉండాలని రాజేంద్ర నగర్ నియోజక వర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే, ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి రక్త దానం చేయడం జరిగింది అదే విధంగా దేశ ప్రధాని 75వ జన్మదిన సందర్భంగా 75 కి తగ్గకుండా 80 మంది యువకులతో రక్త దానం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షుడు ఆడికి జనార్ధన్, బుచ్చి రెడ్డి, మన్మోహన్ రెడ్డి, రావుల భాస్కర్, నవారు మురళీధర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి నిఖిల్ సంతు గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, తలారి చిన్నా, నరసింహారెడ్డి కిరణ్ ఉత్తమ్ అడికే మహేందర్, రాజు కుమార్, రామ కృష్ణ, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మీ, తిరుపతమ్మ, ప్రభావతి, గోవర్ధన్ రెడ్డి, వల్లూరి శ్రీనివాస్, పాండు రంగా రెడ్డి, రాజా వర్ధన్ రెడ్డి, మజార్, తదితరులు పాల్గొన్నారు.




## ఎక్సైజ్ స్టేషన్లో వాహనాల వేలంపాట

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ పట్టణ ఎక్సైజ్ కార్యాలయంలో జిల్లా మద్యనిషేధ అధికారి బి. కిరణ్, ఎక్సైజ్ సీఐ జి. చిరంజీవి ఆధ్వర్యంలో వాహనాల వేలంపాట నిర్వహించబడింది. నేరపూరిత కేసుల్లో సీజ్ చేసిన 41 వాహనాలను వేలానికి ఉంచగా, వాటిలో 21 వాహనాలు విజయవంతంగా అమ్ముడయ్యాయి. మిగతా 17 వాహనాలకు మాత్రం ఎవ్వరూ ముందుకు రాలేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మూడు లక్షల డెబ్బై వేల రూపాయలు కాగా, చివరికి పోటీ బిడ్లతో ఐదు లక్షల ముప్పై తొమ్మిది వేల ఐదు వందల రూపాయల ఆదాయం లభించింది. అధికారులు మాట్లాడుతూ ఇలాంటి వేలంపాటలు ఖజానా బలోపేతానికి తోడ్పడటమే కాకుండా అక్రమాలపై కట్టడి సాధ్యమవుతుందని తెలిపారు.

### దేశానికి మార్గదర్శకశక్తిగా మోడీ

**అమరావతి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశానికి మార్గదర్శక శక్తిగా ఎదిగిన నాయకుడు మోదీ అని కొనియాడారు. భారత్ పట్ల ప్రధాన దృష్టి కేవలం పాలన గురించి మాత్రమే కాదని, దేశ ఆత్మను మేల్కొల్పడం అని అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రధానికి పవన్ బర్త్‌డే విషెస్ తెలియజేశారు. గౌరవనీయులైన ప్రధానమంత్రి శ్రీ. నరేంద్ర మోడీ జీ మీ అద్భుతమైన ప్రయాణంలో అచంచలమైన క్రమశిక్షణ, నిబద్ధత ద్వారా, మన దేశానికి మార్గదర్శక శక్తిగా ఎదిగిన నాయకుడు మీరు. భారత్ పట్ల మీ దృష్టి కేవలం పాలన గురించి కాదు, దేశ ఆత్మను మేల్కొల్పడం.. ప్రజలలో ఆత్మవిశ్వాసం, గౌరవం, ఐక్యతను పెంపొందించడం. ప్రతి పౌరుడు మన సంస్కృతి, వారసత్వం మరియు జాతీయ గుర్తింపు పట్ల గర్వపడేలా మీరు ప్రేరేపించిన విధానం భారతదేశ స్ఫూర్తిని బలోపేతం చేసింది. ఆత్మనిర్భర్ భారత్ కోసం మీ అవిశ్రాంత కృషి, పేదలు, అణగారిన వర్గాల పట్ల మీ దృఢ సంకల్పం మీ నాయకత్వానికి ఎల్లప్పుడూ గుర్తుండిపోయే

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

గురువారం
18.09.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com



## రజక సంఘం కమిటీ ఎన్నిక




**వలిగొండ, విశాలభారతి:** వలిగొండ మండలం దుప్పల్లి గ్రామంలో రజక సంఘం నూతన కమిటీ ఏర్పాటు జరిగింది. ఈ ఎన్నికల్లో వట్టిపల్లి శేఖర్ అధ్యక్షుడిగా, మనిమద్దె రాములు సెక్రటరీగా, బాసవాడ మల్లేష్ ఉపాధ్యక్షుడిగా, వట్టిపల్లి యాదయ్య కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రజక కులస్తుల సమస్యలు, కష్టనష్టాలను పరిష్కరించేందుకు, అలాగే సంఘ అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.




## చరిత్రను చెరిపివేస్తే చెరిగిపోదు- ఎండి. జహంగీర్

**వలిగొండ, విశాలభారతి:**

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ఎవరు చెరిపివేయాలనుకున్నా అది చెరిగిపోదు. 4000 మంది కమ్యూనిస్టు యోధుల రక్త తర్పణమే ఈ పోరాటానికి మూలధనం" అని లిసిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి. జహంగీర్ అన్నారు. బుధవారం వలిగొండ మండల కేంద్రంలో జరిగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, ఆ పోరాటం దోపిడీ, పీడనలను, వెట్టి చాకిరిని నిర్మూలించిందని గుర్తు చేశారు. మహిళలకు సమాన హక్కులు కల్పించడంలో, విద్యా విస్తరణలో, భూ పంపిణీలో ఈ పోరాటం చారిత్రాత్మక మలుపు తిప్పిందన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ లు ఈ పోరాటాన్ని మతం రంగు పులమడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. "ప్రజలు ఉన్నంత వరకూ వీరోచిత రైతాంగ పోరాట చరిత్ర నిలుస్తుంది, దానిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిదే" అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు మాటూరి బాలరాజు, సిర్పంగి స్వామి, గడ్డం వెంకటేశం, కూర శ్రీనివాస్, గర్దాసు నరసింహ, గంటేపాక శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




## మెగా రక్తదాన శిబిరం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బీజేవైఎం ఇబ్రహీంపట్నం అసెంబ్లీ , బీజేపీ ఆదిభట్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదిభట్లలో మెగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. "నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ విముక్తి సాధించేందుకు ప్రజలు చేసిన వీరోచిత పోరాటం ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం ప్రతి ఒక్కరికీ గర్వకారణం" అని పేర్కొన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా వారిని స్ఫూర్తిగా తీసుకొని రక్తదాన శిబిరం నిర్వహించడం సమాజానికి ఎంతో మేలుచేసే పని అన్నారు. రక్తదానం చేయడం ద్వారా అనేక ప్రాణాలు రక్షించబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ఇబ్రహీంపట్నం అసెంబ్లీ కన్వీనర్ వన్నవాడ రవీందర్ రెడ్డి ,ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ గజ్జల నర్సింహా రెడ్డి , బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోరెడ్డి నర్సింహా రెడ్డి , నోముల దయానంద్ గౌడ్ , బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

**తొర్రూరు, విశాలభారతి:**

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని తొర్రూరు ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజు అన్నారు.ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ సుగుణాకర్ రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనదని, ప్రపంచ ఉద్యమాల్లో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ ఉద్యమం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉద్యమం అని తెలిపారు. ఎందరో పోరాట వీరుల త్యాగ ఫలితంగా తెలంగాణకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లభించాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచేలా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.గ్రామీణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు, ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. బిపి, మధుమేహం, రక్తహీనతతో బాధపడే వారిని పరీక్షించి మందులు అందజేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు నందన, మీరాజ్, మానస, శంకర్, డిపిఎమ్ఓ చెప్యాల వనాకర్ రెడ్డి, సిహెచ్ఓ కుసుమ విద్యాసాగర్, ఆరోగ్య సిబ్బంది



## మధుయాష్కిగౌడ్ ని పరామర్శించిన మంత్రులు

**ఎల్బీనగర్, విశాలభారతి:**

స్వల్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ని మంత్రులు వివేక్ వెంకటస్వామి , పొన్నం ప్రభాకర్ గౌడ్ బంజారా హిల్స్ లోని వారి నివాసానికి వచ్చి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

# ఎమ్మెల్యేకి ధన్యవాదాలు

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ, భైరగిగూడ ప్రాంతాలలో అనేక కాలనీలు తీవ్రమైన తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఆల్ కాలనీ ఫెడరేషన్ (%ూజఖీ%) సభ్యులు 24-08-2025న శ్రీనివాసనగర్ కాలనీలో నిర్మించబడిన రెండు సంవత్సరాలుగా వాడకుండా ఉన్న నీటి ట్యాంక్/రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా, ఏసీఎఫ్ ప్రతినిధులు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అధికారులను రిజర్వాయర్‌కు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని, అలాగే గంధంగూడ, భైరగిగూడ ప్రాంతాల దీర్ఘకాలిక తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏసీఎఫ్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన



హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ జనరల్ మేనేజర్ అవసరమైన మరమ్మతులు, పనులు 20 రోజుల్లో పూర్తవుతాయని హామీ ఇచ్చారు. %ఎవీబొ% నుండి వచ్చిన తాజా సమాచారం ప్రకారం, %ూజఖీ% బృందం మళ్లీ ఈ ప్రదేశాన్ని సందర్శించి శ్రీనివాసనగర్ రిజర్వాయర్‌కు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తవుతున్నాయని, ట్రయల్ రన్ జరుగుతోందని, రిజర్వాయర్ ఇప్పుడు రోజువారీ కార్యకలాపాలకు సిద్ధంగా ఉందని గమనించడం జరిగింది. రిజర్వాయర్ పనులను త్వరగా పూర్తి చేయడంలో సహకరించిన ఎమ్మెల్యేకి, HMWS జీఎం, మేనేజర్ మరియు మద్దతు అందించిన అందరికీ ACF బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈ రిజర్వాయర్ ప్రారంభం కావడంతో గంధంగూడ మరియు పరిసర ప్రాంతాలలో అనేక కాలనీల తాగునీటి సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయి. ఈ కార్యక్రమంలో పీసరి వినయ్ రెడ్డి, అధ్యక్షుడు, ఆల్ కాలనీ ఫెడరేషన్,నరేందర్ బాబు, ప్రధాన కార్యదర్శి, ఆల్ కాలనీ ఫెడరేషన్,వంశీ, తిరుమల హిల్స్ కాలనీ,శశిధర్ రెడ్డి, డీడీ కాలనీ,నాగేశ్, అధ్యక్షుడు, శ్రీనివాసనగర్ కాలనీ, విజయ్ పద్మనాభం, ప్రశాంతినగర్ కాలనీ,మహేందర్ రెడ్డి, అధ్యక్షుడు, ఇండస్ వ్యాలీ, హేమ శేఖర్, ఫీల్ గుడ్ హోమ్స్, రాధాకృష్ణ, అధ్యక్షుడు, కెకె నగర్ 1, ఇతర కాలని సభ్యులు పాల్గొన్నారు.

## అమరవీరులకు సిపిఎం నివాళి

**వలిగొండ, విశాలభారతి:**

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఈరోజు సుంకిశాల, పులిగిల్ల గ్రామాల్లో సిపిఎం నాయకులు అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. నాటి రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన పైళ్ల రామచంద్రారెడ్డి, పద్మా రెడ్డి, పులిగిల్ల అమరవీరుల స్థూపాల వద్ద పూలమాలలు వేసి, క్యాండిల్స్ వెలిగించి స్మరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. జహంగీర్, జిల్లాలి లికార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, సిపిఎం సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు గణపతి రెడ్డి, గడ్డం వెంకటేష్, మండల కార్యదర్శివర్గ సభ్యులు వాకిటి వెంకటరెడ్డి, కందడి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కళ్లెం సుదర్శన్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు కొండ కిష్టయ్య, బుగ్గ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. అలాగే



ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటెపాక శివ, ఈర్లపల్లి ముత్యాలు, మంగ బాలయ్య, ఈర్లపల్లి నరసింహ, పైళ్ల మోహన్ రెడ్డి, దొడ్డి బిక్షపతి, కొండూరు సత్తయ్య, మారబోయిన నరసింహ, పోలపల్లి రాములు, కాటేపల్లి వెంకటేశం, వేముల చంద్రయ్య, వడ్డెమాని వెంకటయ్య, వేముల అమరేందర్, కోమ్మిడి సత్తిరెడ్డి, వేముల నాగరాజు, వేముల రాములు, బొడ్డు రాములు, సత్తయ్య, చెరుకు స్వామి, మారబోయిన ముత్యాలు తదితరులు హాజరయ్యారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి

**తొర్రూరు, విశాలభారతి:**

జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు.తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లకావత్ యాదగిరి నాయక్ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా నూతన కమిటీ,రాష్ట్ర నాయకులు ఝాన్సీ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జర్నలిజం అనేది ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని అన్నారు. అందరం కలిసి పనిచేసినప్పుడే ప్రజలకు మేలు చేయగలుగుతామని చెప్పారు. వార్తల సేకరణలో,వాటిని ప్రచురించడంలో జర్నలిస్టుల కృషి మరువలేనిది అన్నారు.గత ప్రభుత్వాలకంటే నేడు తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారుజర్నలిస్టులకు పింఛన్లు,వారి పిల్లలకు పాఠశాల ఫీజులల్లో రాయితీ, వివిధ కారణాలతో మృతి చెందిన ప్రతి జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక సాయం



అందజేసిన ఘనత ప్రభుత్వానికి దక్కిందన్నారు.త్వరలోనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రతి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు కేటాయించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షులు బానోత్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ జీతభత్యాలు లేని జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేస్తున్నారని, కొంతమంది జర్నలిస్టులపై దాడులు చేస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర నాయకులు తాటి సుదర్శన్,జిల్లా గౌరవ అధ్యక్షులు మహేందర్ నాయక్,జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ శ్రీనివాస్ నాయక్, మహబూబాబాద్ డివిజన్ అధ్యక్షులు మోహన్ నాయక్, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ తేజావత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా కోశాధికారి బాలు నాయక్, జాటోత్ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 23న ధర్నాను జయప్రదం చేయండి

### ఎం రాంబాబు

**తిరుమలగిరి, విశాలభారతి:**

తిరుమలగిరి మండల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం పాక మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం. రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమ నిధుల నుండి రూ.346.36 కోట్లను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు దారి మళ్లించడం అన్యాయమని ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తోందని విమర్శించారు. వెల్ఫేర్ బోర్డు నిధులను తిరిగి బోర్డులో జమ చేసి, కార్మికులకు నేరుగా సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారానే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించాలని ఇందులో భాగంగా ఈ నెల 23న సూర్యాపేట జిల్లా లేబర్ కార్యాలయాల ముందు ధర్నా



విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కన్వీనర్ గా కొండబోయిన లింగయ్య, సభ్యులుగా ఏనుగుల గణేష్, పాక మహేష్, ఇట్టిపోయిన నాగరాజు కొమరమల్లు లింగయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చిన్న నాగరాజు, కడారి రవి, కొమరయ్య వీరమల్లు మంజుల, పద్మ, యామ గాని సురేష్, రేగుల మహేందర్, ఇట్ట బోయిన నాగరాజు, పాక మహేష్ పైయంల సురేష్, చిన బోయిన లింగయ్య,వెంకన్న మల్లయ్య,సులోచన, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



## గోవు గరుక స్తంభం ప్రతిష్ఠ లో పాల్గొన్న ఉప్పల

**ఎల్బీనగర్, విశాలభారతి:**

వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్న మహంకాళి అమ్మవారి దేవాలయం గో సేవలో భాగంగా గోవు గరుక స్తంభం ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గరపు దయానంద్ తో కలిసి పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గోవు గరిక స్తంభం నీ ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఆయన అన్నారు. గోమాత సేవలో అందరూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కొత్తపేట అధ్యక్షులు మాదూరి వాసు గుప్తా , వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వనిత క్లబ్ ప్రెసిడెంట్ గుడిపాటి వేణమ్మ సెక్రటరీ పొట్టి సుదీప్నా ట్రెజరర్ బలుస వాసంతి , హరి ప్రసాద్, హనుమంత్ రావు, గోపి కృష్ణ, వాసు గుప్త తదితరులు పాల్గొన్నారు.



## విశ్వకర్మ యజ్ఞంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**తిరుమలగిరి, విశాలభారతి :**

తిరుమలగిరి మున్సిపల్ పరిధిలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో బుధవారం నాడు జరిగిన శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ విరాట్ విశ్వకర్మ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విశ్వకర్మలు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు యాగాలు యజ్ఞాల మూలంగా ప్రజలకు సుఖసంతోషాలు కలుగుతాయని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో విశ్వ కర్మ సంఘ నాయకులు తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## పరిసరాల శుభ్రత- ఆరోగ్య రక్షణకు బాట.

**కురవి, విశాలభారతి:**

స్వచ్ఛహోత్సవ-స్వచ్ఛత హి సేవా-%2025 లో భాగంగా కురవి మండల ఎంపీడీవో కే. వీరబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజలందరితో శుభ్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 365 హైవే జాతీయ రహదారి పరిసరాల్లో శ్రమదానం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ భుజం అందించాలని, చెత్తను రోడ్లపై లేదా డ్రైనేజీలో వేయకుండా డస్ట్‌బిన్ వాడాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలన్నారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం కార్యక్రమాలు చేపడతామని, పర్యావరణహిత పండగలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు కడారి స్వరూప, ఏపీయం కే. దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, కమిటీ సభ్యులు రామారావు, ఉషారాణి, సరోజిని, మంగమ్మ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ హత్య కేసులో పురోగతి

## నాంపల్లికి చెందిన రేష్మగా గుర్తింపు

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

మహిళ హత్య కేసు విషయంలో రాజేంద్రనగర్ పోలీసులు పురోగతి సాధించారు. కిస్మత్పూర్ బ్రిడ్జ్ కింద మంగళవారం ఓ మహిళ మృతదేహం వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఆమె ఒంటిపై బట్టలు లేకపోవడంతో దుండగులు ఆమెపై అత్యాచారం చేసి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానించిన విషయం తెలిసిందే. అయితే హతురాలిని నగరంలోని నాంపల్లికి చెందిన రేష్మా బేగంగా గుర్తించారు. ఆమె నాంపల్లి నుండి రాజేంద్రనగర్ కు ఎందుకు వచింది.. హత్యకు ఎలా గురి అయింది అనే విషయాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. నాంపల్లి నుంచి రాజేంద్రనగర్ వరకు సీసీ కెమెరాలను ఎస్ ఓ టీ పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో ఆధ్వర్యంలో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

## విశ్వకర్మ జయంతి వేడుకల్లో కార్పొరేటర్ కళ్లెం



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** హయత్‌నగర్ వినాయకనగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో స్వర్ణకారసంఘం వారు విశ్వకర్మ జయంతి సందర్భంగా యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు చారి, సభ్యులు సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# పలు కుటుంబాలకు పరామర్శ

## ఎమ్మెల్యే కుసూకుంట్ల ప్రభాకర్ రెడ్డి

**మునుగోడు, విశాలభారతి:**

మండల పరిధిలోని కొంపల్లి, చీకటిమామిడి గ్రామాలకు చెందిన దాసరి శ్రీశైలం యాదవ్, పగిళ్ల లక్ష్మమ్మ,ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర రెడ్డి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం రోజునా మృతుల కుటుంబాల స్వగృహలకు వెళ్ళి పరామర్శించి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు ప్రగాఢ సానుభూతి తెలిపారు,వారి కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో. బి ఆర్ఎస్ మునుగోడు మండల పార్టీ అధ్యక్షులు మందుల సత్యం, మండల సంయుక్త కార్యదర్శి మదనబోయిన పరమేశ్ యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ దోటి కరుణాకర్, డోకూరి వేణుగోపాల్ రెడ్డి, ఐతరాజు పర్వతం, ఓరుగంటి శంకర్, బండారు శ్రీనివాస్ బోయపర్తి సురేందర్, కందుల లింగస్వామి,బోయపర్తి సైదులు, సింగం సైదులు కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.



# విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న కళ్లెం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

వనస్థలిపురంలోని స్వర్ణకారసంఘం వారు విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బి యన్ రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విశ్వకర్మ యజ్ఞంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విశ్వకర్మ దేవుడు సృష్టిశక్తికి ప్రతీక అని, శ్రామిక వర్గాల ఆత్మవిశ్వాసానికి ఆయనే ఆదర్శమని తెలిపారు. సమాజ అభివృద్ధిలో స్వర్ణకార వర్గం పాత్ర ప్రశంసనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్ నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, స్వర్ణకార సంఘం అధ్యక్షులు వెంకటేష్ చారి, సభ్యులు నర్సింహ చారి, నవీన్ చారి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

**మేడిపల్లి, విశాలభారతి:**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్‌లో శ్రీ పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొని, అనంతరం ఆలయ కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, బోడిగే స్వాతి కృష్ణ గౌడ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు, కోనేటి వెంకట్, యాసారం శ్రీనివాస్, కిరణ్, కిరణ్ నాయక్, అమర్ పటేల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు.

# అతివేగంతో బైక్ అదుపుతప్పి ఇద్దరు మృతి

## తల్వేద గ్రామంలో విషాదఛాయలు

**ఆర్మూర్, విశాలభారతి:**



నిజామాబాద్ వెళ్లేందుకు నందిపేట్ మండలం తల్వేద గ్రామానికి చెందిన నీరడి చింటూ (30) తన భార్య (పూజ) తండ్రి నారాయణతో కలిసి బుధవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో నందిపేట్ నుండి మాక్లూర్ మీదుగా నిజామాబాద్ వెళ్లే క్రమంలో దుర్గా నగర్ తండా సమీపంలో వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడిన నారాయణ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చింటూ పూజ గాయపడగా వీరిని స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పూజ మృతి చెందింది, అదే ఆసుపత్రిలో చింటూ చికిత్స పొందుతున్నాడు. చింటూ తన భార్యను ఎగ్జామ్ రాపియ్యడానికి హైదరాబాద్ వెళ్లేందుకు ఉదయం ఇంటి నుండి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. వీరు ప్రయాణించే బైక్ అడవి పంది అడ్డు రావడంతో ప్రమాదం జరిగినట్లు స్థానిక ప్రజలు అనుమానిస్తున్నారు. మామ కోడలు మృతి చెందడంతో కుటుంబంలో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట ఫలితమే విలీనం

## ప్రపంచ చరిత్రలో మహోన్నతమైన ప్రజా పోరాటం తెలంగాణ సాయుధ పోరాటం

## రచ్చ కిషన్ సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి

**మేడిపల్లి, విశాలభారతి:**



మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరానగర్ చౌరస్తాలో మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట విలీనం సందర్భంగా జాతీయ జెండా ఎగరవేసి తెలంగాణ సాయుధ పోరాట వీరులకు జోహార్లు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం 1947 ఆగస్టు 15న, రాగా హైదరాబాద్ సంస్థానంలో1948 సెప్టెంబర్ 17న దాదాపు ఒక సంవత్సరం తరువాత మువ్వన్నెల జెండా ఎగిరింది. ఆ నడుమ కాలంలో ప్రజోద్యమం ఉధృతంగా కొనసాగు తున్న క్రమంలో ఆంధ్ర మహాసభ ప్రతినిధిగా రావి నారాయణరెడ్డి, కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధిగా బద్దం ఎల్లారెడ్డి,ఎఐటియుసి ప్రతినిధిగా మద్దూం మహిమద్దీన్ లు 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చినారు. నిజాం నవాబులకు భూస్వాములకు, ప్రైవేట్ సైన్యం గా ఉన్న ఖాసీం రాజ్వి నేతృత్వంలోని రజాకార్లపై ప్రజలు ఎర్రజెండా పట్టుకొని తిరగబడ్డారు. వారికి తుపాకి గుళ్ళకు, ఒడిసెతో, కారాలతో ఎదురు తిరిగారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధ దళాలు ప్రజలకు దిశా నిర్దేశం చేస్తూ దొరలకు, భూస్వాములకు కబంధ హస్తాల నుంచి ఒక్కొక్క గ్రామాన్ని విముక్తి చేస్తూ 3 వేల గ్రామాలలో 10 లక్షల ఎకరాలను ప్రజలకు పంచిన ఘన చరిత్ర ఆ పోరాటానిది. దాదాపు 4,500 మంది తెలంగాణ నేల తల్లికి అర్పణ చేసి పోరాట సమిదలై తెలంగాణ నేలను ఎర్రటి నేలగా మార్చి నెత్తుటి అక్షరాలతో చరిత్రలో లిఖించారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మేడిపల్లి మండల సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శిలు సిహెచ్ మాధవి, జి నాగరాజు, ఏఐటిసి మండల కార్యదర్శి దండు రమేష్, బి కే ఎం యు మండల కార్యదర్శి కే మహాలక్ష్మి, మండల కౌన్సిల్ సభ్యులు ఇస్తారి, సోమరాజు,సరిత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైద్యారోగ్య సేవలు అందించడం అభినందనీయం



## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, విశాలభారతి:**

మహిళలకు వైద్యారోగ్య సేవలు అందించడం అభినందనీయం అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నాడు మండలం లోని శివలింగాపురం లో గల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు వైద్యారోగ్య సేవలు అందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలి నిర్వాహన అవగాహన కల్పించడం, ఆరోగ్య సేవలు సులభంగా అందేలా చూడడం, ప్రజాభాగస్వామ్యం ద్వారా రక్తదాన శిబిరాలు, నిశ్చయ్ మిత్రా వాలంటీర్ల రిజిస్ట్రేషన్, అవయవ దానాల రిజిస్ట్రేషన్ వంటి అవగాహన సదస్సును ప్రారంభించడం అభినందనీయమనిమహిళలు పిల్లలు ఈ సేవను పొందడానికి సమీపం లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సామాజిక ఆరోగ్య కేంద్రం లేదా అంగన్వాడి కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి డాక్టర్లు, పి హెచ్ ఎం లు, హెచ్.వి లు, ఏఎన్ఎంఎస్ లు, ఆశా వర్కర్లు ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం కార్యక్రమం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారు. ఇంకా మంచి ఫలితాలు రావాలి అని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్డెంట్ సునీల్ , డాక్టర్ నిశాంత్ , గైనకాలజిస్ట్ పద్మ, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళా అధ్యక్షురాలు సౌజన్య , మండల ముఖ్య నాయకులు, పీహెచ్ ఎన్ లు, హెచ్ వి లు, ఏఎన్ఎంఎస్ లు, ఆశా వర్కర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రధానమంత్రి మోడీ జన్మదిన వేడుకలు

**మునుగోడు, విశాలభారతి:**

తెలంగాణ విమోచన దినోత్సవం ప్రధాని నరేందర్ మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు పెంబళ్ల జానయ్య ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగరవేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ 17 సెప్టెంబర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో నిజాం మెడలు వంచి హైదరాబాద్ రాజధానిగా స్వాతంత్ర ఫలాలని అందించన ఘనత మహనీయులకు దక్కుతుందని అన్నారు. అనంతరం భారత యుగపురుషుడు భారతమాత ముద్దుబిడ్డ విశ్వ గురువు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు, భారతదేశాన్ని ప్రపంచంలో విశ్వ గురువు దిశగా నిరంతరం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు, సిద్ధాంతాన్ని ప్రతి చిట్టచివరి పౌరునికి సంక్షేమ పథకాలు అందించడంలో బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు, అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెంబళ్ల జానయ్య ,భవనం మధుసూదన్ రెడ్డి, అక్కెనపల్లి సతీష్, నీరుడు రాజారం,రాష్ట్ర జిల్లా మండల నాయకులు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు,తదితరులు, పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే తెలంగాణ విలీనం



## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**వలిగొండ, విశాలభారతి:**

మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నూతన కార్యాలయ ప్రాంగణంలో జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, నిజాం నవాబుకు వ్యతిరేకంగా పీడిత, తాడిత రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు ప్రాణత్యాగం చేసి తెలంగాణ సాయుధ పోరాటాన్ని విజయవంతం చేశారని గుర్తు చేశారు. భూమికోసం, భుక్తికోసం జరిగిన ఈ మహోన్నత పోరాటంలో 4500 మంది అమరులయ్యారు. 3000 గ్రామాలు స్వరాజ్యాలుగా మారాయి. 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ చేయడం కమ్యూనిస్టు యోధుల త్యాగఫలితమే" అని అన్నారు. అలాగే, "స్వాతంత్ర పోరాటంలో గాని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గాని ఎప్పుడూ పాల్గొనని బీజేపీ, ఈరోజు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తోంది. రైతాంగ పోరాటాన్ని మతపరమైనదిగా చూపించే ప్రయత్నం చరిత్రతో చేసిన మోసం" అని మండిపడ్డారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట ఎర్రజెండా పార్టీలను ధ్వంసం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, "నల్లగొండ జిల్లా వలిగొండ ప్రాంతం కూడా ఒక ప్రధాన పోరాట కేంద్రంగా నిలిచింది. వేములకొండ, అరూరు, పులిగిల్ల, సుంకిషాల వంటి గ్రామాలలో రజాకార్లకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగాన నిలిచి పోరాడింది" అని గుర్తు చేశారు. అనంతరం ఆరూరు గ్రామంలోని సాయుధ పోరాట స్తూపాల వద్ద నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య, బాలగోని సత్యనారాయణ, నరిగే యాదయ్య, బొడిగ సుదర్శన్, కట్ల యాదగిరి, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మారోజు నరసింహ చారి, సుద్దాల సాయికుమార్, మేడి దేవేందర్, బత్తుల బిక్షపతి, యాస జనార్ధన్ రెడ్డి, సలిగంజి కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్లకు శంకుస్థాపన

**వాజేడు, విశాలభారతి:**

ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మహబూబాద్ ఎంపీ బలరాం నాయక్ 50 లక్షల రూపాయలతో సీసీ రోడ్లను ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చింతూరు పంచాయతీ లక్ష్మీపురం, చింతూరు గ్రామంలో మంజూరు చేయడం జరిగింది. వాజేడు కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాదరాజు,నాగారం మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాకర్లపూడి విక్రాంత్ మాట్లాడుతూ ఎంపీ బలరాం నాయక్ ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు ప్రత్యేక దృష్టితో 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించడం ఎంతో సంతోషకరమని వాజేడు మండల కమిటీ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేశారు. వాజేడు మండలానికి మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి దిశగా తీసుకువెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బంధం కృష్ణ గుద్దేటి వెంకటేశ్వర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**తిరుమలగిరి, విశాలభారతి:**



బుధవారం సాయంత్రం సమయంలో తిరుమలగిరి మండల పరిధిలో కన్నా రెడ్డి కుంట తండాలోని లకావత్ వెంకన్న తండ్రి రాములు ఇంటిలో రేషన్ బియ్యం అక్రమంగా నిలువ చేసి ఉన్నాయని నమ్మదగిన సమాచారం మేరకు తిరుమలగిరి మండల రెవెన్యూ వారి ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి అతని ఇంటిలో తనిఖీ చేయగా 27 రేషన్ బియ్యం బస్తాలు సుమారు 10.80 క్వింటాల వరకు దొరికినాయి, వాటిని స్వాధీనపరుచుకొని రెవెన్యూ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాము

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం
18.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

**తొర్రూరు, విశాలభారతి:**

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని మహబూబాబాద్ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిందు మాధురి అన్నారు.మేరా యువభారత్ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరిండెంట్ బానోతు దేవిలాల్ ఆదేశాల మేరకు ప్రధాని మోడీ జన్మదినాన్ని, సమరయోధుల జన్మదినాలను పురస్కరించుకొని బుధవారం తొర్రూరు తో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. దాంతోపాటు జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో వికాస్ దివస్ కార్యక్రమం నిర్వహించారు.మేరా యువ భారత్ జిల్లా సమన్వయకర్త బానోతు వీరన్న నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ బిందు మాధురి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం ముఖ్యమని తెలిపారు. క్లీన్ ఇండియా, గ్రీన్ ఇండియా అనే నినాదం అందిపుచ్చుకొని పరిసరాల పరిశుభ్రత కు పాటుపడాలని కోరారు.వీరన్న నాయక్ మాట్లాడుతూ దేశంలో 35 శాతం యువత ఉన్నారని, యువత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యాదలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ రక్షణకు కారణజన్ముడు నరేంద్ర మోడీ

## బౌద్ధనగర్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్

**సికింద్రాబాద్, విశాలభారతి:**

భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవం పురస్కరించుకొని బుధవారం బౌద్ధ నగర్ డివిజన్లో డివిజన్ అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో వారాసిగూడా చౌరస్తా లో, అంబర్ నగర్ బస్తీలో ప్రమోద్ ఏర్పాటు చేసినటువంటి కేక్ కటింగ్ కార్యక్రమాలలో అతిథిగా పాల్గొన్న డివిజన్ బిజెపి మాజీ కార్పొరేటర్ పి స్వరూపరవిప్రసాద్ గౌడ్ కేక్ కట్ చేసి స్థానికులకు, పిల్లలకు చాక్లెట్లు అందజేయడం జరిగింది. స్వరూప గౌడ్ మాట్లాడుతూ..... భారత దేశ రక్షణ కోసం జన్మించిన యుగ పురుషుడు నరేంద్ర మోడీ అని బయటిదేశాలు భారత దేశంపై కన్నెత్తి చూడడానికి భయపడుతున్నారని ఆమె తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో రవి ప్రసాద్ గౌడ్. దత్తు, ప్రమోద్, నాగరాజు, కుమార్ సుధాకర్,జయంత్, హాజీ బేకరీ,వెంకటేష్, అగుల్ల శీను,రూప్ సాయి, సినిమా రాజు, నాని తదితరులు పాల్గొన్నారు.



# ప్రధానోపాధ్యాయులు ను సన్మానించిన గ్రామస్తులు

**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలంలోని హరిజన కాలనీ నిర్మల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానో పాధ్యాయుడు శివగారి కిరణ్ కుమార్ కు మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా, ఈరోజు పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీమతి చంద్రకళ, అంగన్వాడి టీచర్లు నల్ల నిర్మల, లక్ష్మి మరియు విద్యార్థుల తల్లిదండ్రులు నల్ల మహేందర్,నక్క స్రవంతి, నల్ల మల్లమ్మ మరియు గ్రామస్తులు , విద్యార్థులు అందరూ కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం నాకు ఎంతో సంతోషంగా ఉందని , పాఠశాల అభివృద్ధి చేయడంలో నాతో పాటు మీ అందరి సహకారం ఉందని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి మీ సహాయ సహకారాలు ఎప్పటికీ ఇదేవిధంగా ఉండాలని ఆకాంక్షించారు. అవార్డు రావడంలో సహకరించిన మీ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని అన్నారు.



# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి వార్డ్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజాం పాలనలో రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన అమర వీరులను స్మరించుకోవాలని, స్వేచ్ఛా గగనాన్ని తెలంగాణ ప్రజలకు అందించిన వీరయోధులకు వందనాలు సమర్పించాలన్నారు. భారతదేశాన్ని ఏకం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి ఫలితమే సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవమని, 1948లో ఈ రోజు హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో కలిసిందని, అప్పటి నుండి తెలంగాణ దేశ ప్రగతి ప్రయాణంలో బలమైన భాగస్వామిగా అవతరించిందని తెలిపారు. తరువాత ఆయన హయత్ నగర్ డివిజన్ బీజేపీ నాయకులతో కలిసి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో జరిగిన తెలంగాణ విమోచన దినోత్సవ రాష్ట్ర వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, నాయకులు సంఘీ శశోక్, ప్రధాన కార్యదర్శులు గోవింద చారి, ఎర్రవెలి సత్యనారాయణ, డివిజన్ కార్యవర్గ సభ్యులు వస్పరి వెంకటేష్, లక్ష్మి దాస్, సైదమ్మ, సురేష్ రెడ్డి, ఎర్ర శ్రీకాంత్, ఉగాది బాలు, ఎర్ర శ్రీనివాస్, అరుణ్, బీజేవైఎం నాయకుడు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబికి చిక్కిన తహసిల్ ఉద్యోగులు

**ఖమ్మం:** మరో ముగ్గురు అవినీతి అధికారులు ఏసీబీకి పట్టుబడ్డారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలానికి చెందిన తహసీల్దార్తో పాటు- రెవెన్యూ ఇన్స్పెక్టర్, డాటా ఎంట్రీ- ఆపరేటర్ రూ. 10 వేలు లంచం తీసుకుంటూ తహసీల్ కార్యాలయంలో రెడ్హ్యాండెడ్గా దొరికారు. కొనుగోలు చేసిన భూమి రిజిస్ట్రేషన్ కోసం తల్లాడ తహసీల్ కార్యాలయాన్ని సంప్రదించిన బాధితుడిని అక్కడి అధికారులు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా బుధవారం తహసీల్ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేషర్ శివాజీ రాథోడ్ రూ. 10 వేలు లంచం తీసుకుంటూ పట్టు-బడ్డాడు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న తహసీల్దార్ వంకాయల సురేష్కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మాలోత్ భాస్కర్రావును ఏసీబీ అధికారులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

## పోలీసుల అదుపులో వ్యభిచార నిర్వాహకులు



**మేడిపల్లి, విశాలభారతి:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ద్వారకానగర్లో ఉండే స్వప్న బ్యూటీషియన్ గా పనిచేస్తోంది. భర్త చనిపోయి ఆర్థిక ఇబ్బందులతో ఈజీ మనీ కోసం తెలిసినవారు నవీన్, అశోక్ తో కలిసి ఏపీ యువతులను రప్పించి వ్యభిచార గృహం నిర్వహిస్తోందని పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో ఎస్సై నర్సింగ్రావు సిబ్బందితో కలిసి దాడి చేసి ఇద్దరు యువతులు, ఓ విటుడు, నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. 3 సెల్ఫోన్లు, రూ. 1200 స్వాధీనం చేసుకున్నారు.

# బోరు బావుల నుంచి సెగలు కక్కే వేడి నీరు

## భూతాప జలాల వల్ల ఆ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు

## భూమి లోపల వేడి జలాల రహస్యం

**మణుగూరు, విశాలభారతి:**

సాధారణంగా బోరుబావుల నుంచి మంచి నీళ్లు లేదా ఉప్పు నీళ్లు వస్తుంటాయి. కానీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని పగిడేరు గ్రామంలో మాత్రం సెగలు కక్కే వేడి నీళ్లు ఉబికి వస్తాయి. ఈ అరుదైన భూతాప జలాల వల్ల ఆ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. దాదాపు 3500 జనాభా ఉన్న ఈ గ్రామం ఇప్పుడు వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి రంగంలో పరిశోధనా కేంద్రంగా మారింది. పగిడేరు గ్రామంలో పొలాల వద్ద, ఊరి పొలిమేరల్లో వేసిన బోరుబావుల నుంచి ఎలాంటి మోటార్లు లేకుండానే వేడి నీళ్లు నిరంతరాయంగా బయటకు వస్తుంటాయి. ఈ నీళ్ల ఉష్ణోగ్రత దాదాపు 80 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. రైతులు ఈ నీటిని నేరుగా పంటలకు ఉపయోగించకుండా మొదట వాటిని మడులలో నిల్వ



ఉంచి, ఆ తర్వాత వ్యవసాయానికి వాడుకుంటారు. ఒకప్పుడు నీటి కొరతతో ఇబ్బంది పడిన ఈ గ్రామంలో ఇప్పుడు ఈ భూతాప జలాల వల్ల ఏటా దాదాపు వంద ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. వేసవిలో కూడా నిరంతరాయంగా నీళ్లు లభిస్తుండటంతో రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**భూమి లోపల వేడి జలాల రహస్యం..**

కొన్ని సంవత్సరాల క్రితం సింగరేణి సంస్థ ఈ ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలను వెతికేందుకు తవ్వకాలు చేపట్టింది. అలా తవ్విన ప్రతి చోటా సలసలా మరిగే వేడి నీళ్లు బయటకు వచ్చాయి. ఆ తర్వాత 2014లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీ ఎస్ ఐ ) బృందం ఈ వేడి జలాలపై పరిశోధనలు ప్రారంభించింది. సుమారు 1,000 మీటర్ల లోతులో నీళ్లు 180 నుంచి 220 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉన్నట్లు వారు గుర్తించారు. భూ అంతర్భాగంలో ఉన్న పగుళ్లే ఈ వేడికి కారణమై ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

**వేడి నీటితో విద్యుత్ ఉత్పత్తి..**

భూతాప జలాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలనే ఆలోచనతో పగిడేరులో 2021లో ఒక ప్రయోగాత్మక జియో థర్మల్ ప్లాంట్ను ఏర్పాటు చేశారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిధులు మంజూరు చేయగా సింగరేణి, శ్రీరామ్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సంస్థలు ఈ ప్రాజెక్ట్లో పరిశోధనలు చేస్తున్నాయి. భారతదేశవ్యాప్తంగా 381 భూతాప ప్రాంతాలు ఉన్నప్పటికీ వాటిలో జియో థర్మల్ ప్లాంట్కు పగిడేరు అత్యంత అనుకూలమైన ప్రదేశమని గుర్తించారు. ఇక్కడ ఇప్పటికే ప్రయోగాత్మకంగా 20 కిలోవాట్ల విద్యుత్ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం వాణిజ్యపరంగా 122 మెగావాట్ల విద్యుత్ను ఉత్పత్తి చేసే ప్రణాళికతో పనులు చేపడుతున్నారు. తాజాగాబికేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ( ఏం ఎన్ ఆర్ ఈ ) తన జాతీయ పాలసీలో పగిడేరులోని భూతాప క్షేత్రాన్ని జియో థర్మల్ ప్లాంట్కు అనుకూలమైనదిగా పేర్కొంది.

# హైదర్ నగర్ లో ఘనంగా విశ్వకర్మజయంతి వేడుకలు





## విశ్వకర్మ చిత్రపటానికి పూజ చేస్తున్న హైదర్ నగర్ విశ్వకర్మ సంఘం సభ్యులు

**విశాలభారతి:**

ప్రపంచపు తొలి వాస్తు శిల్పి, సృష్టికర్తగా పేరొందిన విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలు బుధవారం హైదర్ నగర్ లో ఘనంగా నిర్వహించారు.స్థానిక హనుమాన్ దేవాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఏ మేరకు అయ్యప్ప విశ్వకర్మ, ప్రభాకర్ విశ్వకర్మ లు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో సంఘం సభ్యులు సునీల్ విశ్వకర్మ, శ్యామ్ విశ్వకర్మ, సురేష్ విశ్వకర్మ, నాగప్ప విశ్వకర్మ, ఓంకార విశ్వకర్మ, బి. అశోక్,మారుతి విశ్వకర్మ, రాజు విశ్వకర్మ, జగన్నాథ్ విశ్వకర్మ, రఘు విశ్వకర్మ, మహాదేవ్ విశ్వకర్మ ఏ.అశోక్,తదితరులు పాల్గొన్నారు.




# చరిత్రను వక్రీకరించడమే పనిగా పెట్టుకున్న బీజేపీ

## ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి

## కులమత అతీత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

చరిత్రను ఒకరిక్రించడమే పనిగా పెట్టుకున్నా పార్టీ బిజెపి అని ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట విలీన దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం మరియు శేరిలింగంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కేవలం మతాలు కులాలకు మధ్య జరిగింది కాదని భూమి భక్తి ఈ దేశంలోని పేదరికం నిర్మూలన కోసం జరిగిన పోరాటమని ఆయన అన్నారు. ఈ పోరాటంలో ఏనాడు పాల్గొని చరిత్ర లేని బిజెపి ఈరోజు మతం రంగు పోస్తూ ఈ చరిత్రను పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తుందని వారు అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతోమంది బడుగు బలహీనవర్గాల ప్రజలు దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని ఆ పోరాటంలో ముస్లింస్ ముందు బాగాన ఉండి పోరాటం చేసిన విషయం గుర్తు చేశారు. మొదటగా ఈ ఉద్యమంలో చనిపోయింది షేక్ బందగి అని గుర్తు చేశారు. ముద్ద మోయుద్దీన్ హైదరాబాద్ కామ్రేడ్ అసోసియేషన్ తదితర సంస్థలు నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేయడంలో కీలక పాత్ర పోషించిందని ఆయన తెలిపారు ఈ పోరాటాన్ని బిజెపి ఎంత వక్రీకరించే ప్రయత్నం చేసిన వారి పాత్ర ఏమాత్రం లేదని అది తెలంగాణ ప్రజలకు యావత్తు ప్రపంచానికే తెలుసని ఆయన అన్నారు బిజెపి కుట్రలను తిప్పికొడుతూ తెలంగాణ చరిత్రను నేటి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు పైన ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు గా సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు ఆర్. సాంబశివరావు శేరిలింగంపల్లి జోన్ కన్వీనర్ సి. శోభన్, కృష్ణ సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు విజయ్ కుమార్, అనిల్, రవీందర్ ఎస్వికే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ షెడ్లు నిర్మాణాలు అధికారులకు కనిపించడం లేదా...

## ఓడిన వారితో కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటి

## ప్రోటోకాల్ పాటించరా.. మంద సంజీవరెడ్డి

**బోడుప్పల్, విశాలభారతి:**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో అనేక అక్రమ షెడ్లు నిర్మాణాలు జరుగుతుంటే చర్యలు తీసుకోరా అని స్థానిక బీఆర్ ఎస్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, నాయకులు కమిషనర్ పై ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా మంద సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో బోడుప్పల్ కమిషనర్ శైలజని తన ఛాంబర్ లో కలిసి వినతిపత్రం అందజేశారు. మంద సంజీవ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించడం లేదని, గెలిచిన వారిని వదిలేసి, ఓడిన వారితో కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని, స్థానిక నాయకులు, ఎంపీ, ఎమ్మెల్యే లకు ఆహ్వానం లేకుండానే కార్యక్రమాలు నిర్వహించడం పై మండిపడ్డారు. బోడుప్పల్ ఏ గల్లీలో చూసిన అక్రమ షెడ్లు నిర్మాణాలు అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇలానే కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చెపడతామని హెచ్చరించారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని, రానున్న రోజులలో జరుగు కార్యక్రమం లో ప్రోటోకాల్ పాటిస్తామని హామీ ఇచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చి రెడ్డి, బీ ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, మాజీ కార్పొరేటర్లు, కాలనీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# భౌతిక దేహానికి నివాళులర్పించిన నల్ల శ్రీరామ్

**దేవరుప్పుల, విశాలభారతి:**

పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు దేవరుప్పుల మండలం,లకావత్ తండా (డి) గ్రామానికి చెందిన లావుడ్యా సొమ్లా నాయక్(54) నిన్న సాయంత్రం అనారోగ్యంతో మరణించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్లి వారి భౌతికదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ దేవరుప్పుల మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బోడయ్య కన్నా,దేవరుప్పుల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,విజయ డైరీ జిల్లా చైర్మన్ కాసారపు ధర్మా రెడ్డి,నాయకులు ఓడపల్లి రవి,రెడ్డిరాజుల రమేష్,సోమ్లా, తోటకూరి పాండు,బీసీ,ఎస్సీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు కాడబోయిన గణేష్,ఇనుముల నాగరాజు,మహ్మద్ రసూల్,ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్,నాయకులు రామచంద్రనాయక్,మాసంపెల్లి సాత్విక్ పటేల్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం
18.09.2025
హైదరాబాద్
7
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily
GENERAL NEWS




## అఖిల భారత స్థాయి పోటీల్లో సిద్ధార్థ్ దత్తకు స్వర్ణ పతకం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హైదరాబాద్‌కు చెందిన చిన్న వయస్కుడైన గుర్రపు స్వారీదారుడు సిద్ధార్థ్ దత్త అఖిల భారత స్థాయిలో ఘనవిజయం సాధించాడు. బెంగళూరులోని ఎంబసీ ఇంటర్నేషనల్ రైడింగ్ స్కూల్‌లో సెప్టెంబర్ 10 నుండి 14 వరకు జరిగిన ఎఫ్.ఇ.ఐ జంపింగ్ చిల్డ్రన్స్ క్లాసిక్ బ్రోన్జ్ టూర్ పోటీల్లో జీరో ఫాల్ట్‌తో నాలుగు రౌండ్లు పూర్తి చేసి ప్రథమ స్థానాన్ని దక్కించుకొని స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ నాలుగో తరగతి చదువుతున్న సిద్ధార్థ్, ఈ విజయానికి ముందు జరిగిన ఇండియన్ టీమ్ సెలక్షన్ ట్రయల్స్‌లో రెండో స్థానం సాధించి భారత జట్టులో చోటు సంపాదించాడు. రాబోయే అంతర్జాతీయ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. జైపూర్‌లోని సాగర్ ఎక్వెస్ట్రియన్ అకాడమీ తరఫున తన గుర్రం అస్టెడ్ ఫ్రాంక్ హైట్తో కలిసి పోటీపడుతూ ప్రతిభను చాటుకున్నాడు. గుర్రపు స్వారీపై చిన్ననాటి నుంచే ఆసక్తి పెంచుకున్న సిద్ధార్థ్, అంతకుముందు జైపూర్‌లో జరిగిన సప్త శక్తి హార్స్ షోలోనూ మెరిశాడు. ఆ పోటీల్లో జట్టు విభాగంలో ఒక స్వర్ణం, ఒక రజతం, వ్యక్తిగత విభాగంలో ఒక కాంస్యం, ఒక రజతం సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. డిసెంబర్ 2025లో జరగనున్న జూనియర్ నేషనల్ ఎక్వెస్ట్రియన్ ఛాంపియన్‌షిప్ (జె.ఎన్.ఇ.సి) షో జంపింగ్ విభాగానికి ఇప్పటికే అర్హత సాధించాడు. దేశంలోని ప్రతిభావంతులైన యువ స్వారీదారులు పాల్గొన్న ఈ పోటీల్లో విజయం సాధించడం ద్వారా సిద్ధార్థ్ దత్త పేరు దేశవ్యాప్తంగా నిలిచిపోగా, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాడు.




## గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్‌లో ప్రజా పాలన దినోత్సవం

### చైర్మన్ చిలుక మధు సుదాన్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే మార్కెట్ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది, అలాగే జాతీయ జెండాకు వందనం చేసి దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ సిహెచ్. బాస్కర చారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, సభ్యులు మచ్చేందర్ రెడ్డి, అంజయ్య, బండి మధుసూదన్ రావు, గణేష్ నాయక్, రఘుపతి రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం పాల్గొన్నారు.





## ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

**విశాలభారతి:**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సేవా పక్షం మండల కన్వీనర్ కందుల తానేష, కో కన్వీనర్లు మందుల లక్ష్మి, పల్లెర్ల నరసింహ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. మొదటగా వలిగొండ పట్టణంలో బిజెపి మండల అధ్యక్షుడు జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం మోడీ పుట్టినరోజు సందర్భంగా ప్రధాన కూడలిలలో, ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో విద్యార్థులకు, రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకుడు ఏలే చంద్రశేఖర్ మాట్లాడుతూ %-% “రజాకారుల కబంధ హస్తాల నుండి తెలంగాణకు నిజమైన విముక్తి 1948 సెప్టెంబర్ 17న లభించింది” అని పేర్కొన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, రానున్న రోజుల్లో వారి నాయకత్వంలో భారత్ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సిఎన్ రెడ్డి, బందారపు లింగస్వామి, జిల్లా నాయకులు రాచకొండ కృష్ణ, బచ్చు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

**దేవరుప్పుల, విశాలభారతి:**

ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా దేవరుప్పుల మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తహసీల్దార్ ఆడెపు ఆండాలు. అనంతరం సిబ్బందితో కలిసి సామూహిక జాతీయ గీతాలాపన చేశారు. ఈ



కార్యక్రమంలో ఆర్ఐ రాజు, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్ఏ లు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞం మహోత్సవం



**మేడిపల్లి, విశాలభారతి:** శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం మేడిపల్లి మండలం, శ్రీ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించడం జరిగింది, ఆలయ కమిటీ అధ్యక్షులు కూరెల్ల లక్ష్మీనారాయణ చారి ,ప్రధాన కార్యదర్శి సిరిపురం సర్వేశ్వర చారి ,కోశాధికారి కందోజు వెంకటాచారి మరియు కమిటీ సభ్యులు నారోజు జంగాచారి,బెజ్జంకి శ్రీనివాసచారి , శ్రీరామోజు శంకరాచారి ,శ్రీరామోజు వేణు చారి , నల్లనాగులు మహేష్ చారి,పడకంటి కుమార్ చారి, పుతుకనూరి సంతోష్ చారి, కొండపర్తి నర్సింహా చారి, బోధన్ గోపాల్ చారి,కాసోజు కృష్ణ బ్రహ్మాచారి మరియు విశ్వకర్మ సభ్యుల సమక్షంలో యజ్ఞం.

# ఏదైనా ప్రమాదం జరిగితే వారే కారణం

### నా భర్త ప్రాణ భద్రతకు ముప్పు

### నాగుగులోత్ వెంకన్న, ధరవత్ వెంకన్నపై అనుమానాలు

### తెల్లబోయిన రవి, మహమ్మద్ నూరుద్దీన్ లను నిందించిన భార్య

### ప్రకటనతో కలకలం - భార్య నేరుగా పేర్లు వెల్లడించింది.

**మహబూబాబాద్, విశాలభారతి:**

మండలం లక్ష్మి పురం (బి )గ్రామం లో ఈ నెల 13న, రాత్రి 10గంటల సమయంలో గడి తండా కు చెందిన ధరవత్ వెంకన్న ఇంటికి వచ్చి లక్ష్మి పురం తండా కు చెందిన గుగులోత్ వెంకన్న, తెల్లబోయిన రవి, మహమ్మద్ నూరుద్దీన్, దారవత్ వెంకన్న లు కలిసి వాళ్లే మాట్లాడుతూ నా భర్త అయినా చారి హరీష్ ను ఉద్దేశించి, మాదిగ లంజకొడుకు పెళ్ళాం ను అనుభవించాలనీ వచ్చాము, అరేయ్ నూరు, అరేయ్ రవి



కత్తితే హరీష్ ను చంపుదాం, చంపితే 50,000=00 రూపాయలు ఇస్తా అంటూ నానబూతులు తిట్టుతూ తల్వారు పట్టుకుని పై పేర్కొన్నా వ్యక్తులు నా ఇంటికి వచ్చి తలుపులు కొట్టి అరేయ్ లంజకొడుక లేరా, తలుపులు తియ్యరా, నీ సంగతి చూస్తాం అంటూ తలుపులు తెరవలేదని తిరిగి వెళ్ళిపోయినారు. తెల్లారు జామున అనగా 14.09.2025న, మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో నేను (చారి విమల) పిటిషన్ ఇచ్చాము. పోలీసులు స్పందించి వెంటనే స్పందించి మా గ్రామం కు వచ్చి విచారణ చేసినారు అ విచారణలో వారు వచ్చింది నిజం, వారు తిట్టింది నిజం అని సాక్ష్యులు చెప్పి తిరిగి వెళ్లగా ఈ కేసు నుండి బయట పడటం కోసం 14న, ఓ గిరిజన మహిళ ను నా భర్త అసభ్యంగా ప్రవర్తించడని ఆమె పేరా రూరల్ పీస్ లో పిటిషన్ ఇప్పించి దాని విచారణ కోసం %పూా%, మరో కానిస్టేబుల్ వచ్చి వారు చెప్పిన సాక్ష్యలకు ఫోన్ చేసి ఆమె పెట్టిన కేసు గురించి అడుగగా మాకు ఏ విషయాలు తెలువవు,మేము చూడలేదు, వినలేదు, ఎవరికీ చెప్పలేదు ఈ కేసు గురించి ఏమి తెలువదు అంటూ సాక్ష్యాలు చెప్పిన తరువాత ఇప్పటివరకు మేము పెట్టిన కేసును నమోదు చేయడం లేదు ఇప్పటికైనా పోలీసులు స్పందించి వారిపై కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేయాలనీ మాజీ వార్డు సభ్యురాలు చారి విమల అన్నారు.గ్రామంలో ఉన్నవాట్సాప్ గ్రూపులల్లో నా భర్తను అవహేళను చేస్తూ అవమానకారంగా పెడుతున్న మహమ్మద్ నూరుద్దీన్ పై చర్య తీసుకోవాలని, నా భర్త కు ఎలాంటి ప్రాణహాని జరిగిన అది గుగులోత్ వెంకన్న, దారవత్ వెంకన్న, తెల్లబోయిన రవి, మహమ్మద్ నూరుద్దీన్ లదే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

## తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేసిన యువ రైతులు

### యూరియా పంపిణీలో అవకతవకలు- అర్హులైన రైతులకు నష్టం.

### రూ.266కే ఇవ్వాల్సిన యూరియాను రూ.300 వసూలు

### ఒకరికి ఐదు బస్తాలు-మరొకరికి ఒక్క బస్తా కూడా రాక నిరసన

### యువ రైతులు బేతమల్ల సహదేవ్, బానోత్ దేవేందర్, కొల్లూరి గణేష్.

**కురవి, విశాలభారతి:**

కురవి మండలంలో యూరియా పంపిణీ అవకత వకలపై కురవి మండల తాసిల్దార్ కార్యాల యంలో యువ రైతులు బేతమల సహదేవ్, బానోత్ దేవేందర్, గణేష్ లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. కురవి మండలంలోని నేరడ, కురవి, గుండ్రాతి మడుగు సొసైటీ లలో రైతులకు యూరియా పంపిణిలో అధికారులు ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా అవకతవకలకు పాల్పడ్డారని సమగ్ర విచారణ జరుపాలని తహసీల్దార్ కు వివరించారు. స్పందించిన కురవి తహసీల్దార్ సమగ్ర విచారణ జరుపుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యువరైతులు మాట్లాడుతూ.., ప్రభుత్వం సబ్సిడీ ధరకు అందించాల్సిన యూరియా బస్తాలు కొంతమంది అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా అర్హులైన వారికి చేరడం లేదని తీవ్ర ఆరోపణలు చేశారు. భూమి పరిమాణం, సాగు పంటల ఆధారంగా సరైన కేటాయింపులు జరగకపోవడంతో కొంతమంది రైతులకు ఒక్క బస్తా కూడా



దొరకకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. “సబ్సిడీ పేరుతో ప్రభుత్వం ఇచ్చే సాయం రైతులకు చేరకపోవడం దురదృష్టకరమని, నేరడ, కురవి సొసైటీ లో ఒకే వ్యక్తికి ఐదు బస్తాల వరకు ఇవ్వడం, ఇంకొంతమందిని పూర్తిగా విస్మరించడం జరిగింది. ధర విషయంలో కూడా రైతులను మోసం చేశారు. రూ.266కే ఇవ్వాల్సిన యూరియాను “చిల్లర” లేదు అంటూ రూ.300 వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. “రైతు బతుకుతో ఇలా ఆటలాడటం అసహనం కలిగిస్తోంది. చిల్లర లేదంటూ రూ.34 అదనంగా వసూలు చేయడం స్పష్టమైన దోపిడీ. ఈ అన్యాయంపై వెంటనే విచారణ జరిపి, అదనంగా వసూలు చేసిన డబ్బును రైతులకు తిరిగి చెల్లించాలి” అని హెచ్చరించారు. రైతు కోసం ప్రభుత్వం ఇస్తున్న ప్రతి రూపాయి రైతు చేతికి చేరాలి. అధికారులు, సొసైటీ సభ్యులు కలసి ఇలా రైతులను మోసం చేయడం సరికాదన్నారు. రైతుల పంట వివరాలు మండల వ్యవసాయ అధికారుల దగ్గరలేవా ఇష్టం వచ్చినట్లుగా ఆన్లైన్ రావడం లేదనే షాక్ లతో రైతుల (తంబు) వేలిముద్ర, భూమి పత్రాలు లేకుండా టోకెన్లతో ఇష్టారాజ్యంగా యూరియా పంపిణి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ అధికారులు తమకు దగ్గర ఉన్న రైతులకు మూడు నుండి ఐదు బస్తాలు ఇచ్చారని ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు.




## సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమే.

**మహబూబాబాద్, విశాలభారతి:**

సిపిఐ ( ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 విద్రోహ దినం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకులు కన్మంతరెడ్డి భాస్కర్ రెడ్డి అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సు లో పార్టీ జిల్లా నాయకులు ఎస్.కె మదార్ పాల్గొని మాట్లాడుతూ 1947ఆగస్టు15న భారత దేశం నుండి బ్రిటీష్ వాళ్ళు వెళ్లిపోయే నాటికి తెలంగాణాలో హైదరాబాద్ సంస్థానంను 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలిస్తున్నాడు. నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ ప్రభువుల అణిచివేత దోపిడీలకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉవ్వెత్తున సాగుతుంది. భూమికోసం, భుక్తికోసం,వెట్టిచాకిరి వ్యతిరేకంగా బందూకులు పట్టి కమ్యూనిస్టులు పోరాటం చేశారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వేల మంది అమరత్వం పొందారు.మూడు వేలకు పైగా గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాలకు పైగా భూస్వాముల భూములను ప్రజలకు పంచి పెట్టిన చరిత్ర కమ్యూనిస్టు విప్లవకారుకు ఉందని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పటేల్ సైన్యాలు, నిజాం సైన్యాలు కలిసి మూకుమ్మడిగా తెలంగాణ ప్రజలపై భయంకరంగా దాడులు జరిపి ఉద్యమాన్ని అణిచి వేశాయి. వీరతెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో దేశంలో అనేక ఉద్యమాలు ముందుకు వచ్చాయని ఆయన అన్నారు. అందుకనే సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణకి విద్రోహ దినమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ, ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఎస్ కవిత, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి బానోత్ దేవేందర్, సట్ల యాకయ్య, సుమన్, వెంకన్న తది తరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు



**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని శ్రీ విశ్వకర్మ సంఘ భవనంలో శ్రీ విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షులు పంతంగి మదనాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది .తదఅనంతరం శ్రీ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు పంతంగి మదనాచారి మాట్లాడుతూ ఈ జగతికి మూలమైన విశ్వకర్మ లు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నాం ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా వెనుకబడి ఉన్నావ్ మాకు ప్రభుత్వాలు విశ్వకర్మ ఫెడరేషన్,వృత్తి చేసుకునే విశ్వకర్మలకు ఎటువంటి గ్యారెంటీ లేకుండా 2 లక్షల వరకు లోన్లు,50 సంవత్సరాలు నిండిన ప్రతి విశ్వకర్మకు పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో మనుమయ స్వర్ణకార సంఘాలు పాల్గొన్నారు.అనంతరం బైకు రాలీ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మనుమయ గౌరవ అధ్యక్షులు శానకొండ రాజు చారి, ప్రధాన కార్యదర్శి పగిడోజుశశిభూషణ్ చారి,కోశాధికారి పోలోజు సత్యనారాయణ చారి,మండల విశ్వకర్మ అధ్యక్షులు బొల్లోజు రవికుమార్ చారి ప్రధాన కార్యదర్శి దాసోజు బిక్షమాచారి బ్రహ్మంగారి గుడి అధ్యక్షులు పోలో శ్రీనివాస్ చారి గౌరవాధ్యక్షులు మండలోజు బిక్షమాచారి,కోశాధికారి దేవరకొండ నరసింహ చారి, కొండోజుసతీష్ చారి, శ్రవణ్ కుమార్,మారయాచారి పాండు,చారి నాగేష్ చారి,రాచకొండ శ్రీనివాస్ చారి,మచ్చ గిరి చారి,వీరాచారి శివకుమార్ చారి,బొల్లోజు విశ్వ రూపం,విష్ణు చారి,వినుకొండ రామాచారి చంద్ర శేఖర్,శ్రీనివాస్ చారి,వెంకటాచారి,లక్ష్మణ్, కనకా చారి,శ్రవణ్ కుమార్ చారి,పోలోజు సురేష్ చారి, దేవరకొండ సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ విమోచన దినం త్యాగం, పోరాటానికి ప్రతీక

**హైదరాబాద్, విశాలభారతి:**

భారత ప్రధాని నరేంద్ర మోడీ జీ జన్మదినం, విశ్మకరమ్మ జయంతి, తెలంగాణ విమోర్చ దినోత్సవం సందర్భంగా సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో కేటధాన్ లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రక్తదాన శిబిరం, జాతీయ పతాక ఆవిష్కరణ, విశ్మకర్మ పూజా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు బుక్కా వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై అభినందనలు తెలియజేశారు. అలాగే ఈ సందర్భంగా బుక్క వేణు గోపాల్ మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17 న భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ నిజాం పాలనకు ముగింపు పలికింది. ఈ విజయంతో హైదరాబాద్ రాష్ట్రం భారత సంఘంలో విలీనం అయి, తెలంగాణ ప్రజలకు ప్రజాస్వామ్యం, సమానత్వం, స్వేచ్ఛ లభించాయి. విమోచనకు ముందు తెలంగాణ ప్రజలు నిజాం నియంతృత్వ పాలన మరియు ఫ్యూడల్ డోరా వ్యవస్థ కింద ఎన్నో కష్టాలు అనుభవించారు. తెలంగాణ విమోర్చ దినం అనేది త్యాగం, పోరాటానికి ప్రతీక, స్వేచ్ఛ కోసం పోరాడిన అమర వీరులను స్మరించుకునే రోజు. ఇది తెలంగాణ ఆత్మగౌరవం, ఐక్యత, స్వేచ్ఛా విలువలకు ప్రతీకాత్మకంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమలో అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, ఓబీసీ స్టేట్ లీడర్ అడికే రాజు ,ఎస్సీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ జోగు రవి , రావులు భాస్కర్, బల్ల శ్రీనివాస్ యాదవ్ , వెంకట్ రమణ గుప్తా , బొమ్మ రాజు నర్శిమా న జగన్, న్ మురలీధరన్ రెడ్డి,మైలార్దేవ్పల్లి డివిజన్-1 ప్రెసిడెంట్ గోదా పండు యాదవ్ , గురుడి అంజి, వై నర్సు రెడ్డి ,రామ్ గౌడ్, వల్లూరు శ్రీనివాస్ ,వై ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

గురువారం
18.09.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com



### 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధిస్తాం

**విశాఖపట్నం:** 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా దేశం వేగంగా ముందుకెళ్తోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశ అభివృద్ధిలో జీసీసీలు కీలక పాత్ర పోషించనున్నాయని ఆమె పేర్కొన్నారు. విశాఖ కేంద్రంగా జీసీసీలు ఏర్పాటు కావడం మంచి పరిణామమన్నారు. జీసీసీలు ఏర్పడితే భారతదేశం వరల్డ్ హబ్‌గా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. రుషికొండలో జరిగిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ బిజినెస్ సదస్సు లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ నివేదికను ఇద్దరూ సంయుక్తంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, మానవ వనరుల వినియోగం, నైపుణ్యం పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. అమరావతి ప్రస్తుతం ఫిన్‌టెక్ కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.




## బదిలీపై వెళ్లిన పోలీసు అధికారుల సేవలు అభినందనీయం

### బాలానగర్ సీఐ నర్సింహా రాజు

**కూకట్ పల్లి, విశాలభారతి:**

బాలానగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ నర్సింహా రాజు ఆధ్వర్యంలో మంగళవారం బదిలీపై వెళ్లిన పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయినా అధికారులను బాలానగర్ సీఐ నర్సింహా రాజు, డిఐ సక్రమ్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఇందులో బాలానగర్ డిఐ నాగిరెడ్డి, ఎస్ఐ సరళ, వెంకటేశం, ఏఎస్ఐ ప్రభాకర్, నర్సింహులు, హెచ్సీ హరి కిషన్, ప్రసాద్, హోమ్ గార్డ్స్ రామ రావు, శ్రీనివాస్ రెడ్డి, యాదప్ప లను ఘనంగా షాల్వా తో సన్మానించిన వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన అధికారుల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సర్వసాధారణమని ఎక్కడ విధులు నిర్వహించిన అంకిత భావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కాలానుగుణంగా ఎన్నో మార్పులు సమాజంలో వస్తున్నాయని సమయాన్ని సందర్భాన్ని బట్టి విధులు నిర్వర్తించాలని విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం బాలానగర్ డిఐగా విధులు నిర్వహించిన నాగిరెడ్డి మాట్లాడుతూ మనం చేసే పని కావచ్చు లేదా విధులు కావచ్చు ప్రజల అభిప్రాయమే పోలీసులకు ప్రామాణికమన్నారు. ప్రజలకు సేవలు అందించడం వారితో మమేకమై చట్టబద్ధంగా ముందుకెళ్లడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు హాజీ మియా, సరితా రెడ్డి, వినోద్ కుమార్, ఏఎస్ఐలు హనుమయ్య, హెచ్సీలు, పీసీలు, మహిళా పీసీలు తదితరులు పాల్గొన్నారు.

## గురిమెల్ల వద్ద తెల్లవారుజామున ఘోర ప్రమాదం.

### పలువురికి తీవ్ర గాయాలు.

### యూరియా కోసం ప్రాణాల పణంగా పెట్టిన గిరిజన రైతులు

### యూరియా కోసం వెళ్తున్న రైతులతో ఆటో బోల్తా

### బోడ కిషన్, మాలోతు మంగమ్మ పరిస్థితి విషమం



**బయ్యారం విశాలభారతి:**

బయ్యారం మండలం గురిమెల్ల గ్రామం గిరిజన రైతులు యూరియా కోసం తెల్లవారుజామున బయలుదేరి ప్రాణాలను పణంగా పెట్టుకున్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మూడున్నర గంటల సమయంలో పొగమంచు, మబ్బు కారణంగా దారి కనబడక ఆటో బోల్తా కొట్టడంతో మాలోతు మంగమ్మ, బోడ కిషన్ సహా పలువురు మహిళా రైతులు తీవ్రంగా గాయపడ్డారు. బోడ లక్ష్మి తలపగిలి రక్తస్రావం ఆగక పరిస్థితి విషమించింది. వజ్జ సూరమ్మ తలకు గాయం కాగా ముఖం పూర్తిగా చిత్రమైందని వైద్యులు తెలిపారు. గాయపడిన వారిని మహబూబాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా కొంతమందిని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్చారు. ఈ సంఘటన వెనుక ప్రభుత్వాల నిర్లక్ష్యం ప్రధాన కారణమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియా పంపిణీ లోపంతో పేద రైతులు రాత్రిపూటే లైన్‌లో నిలబడటానికి వెళ్లి ఇలాంటి దుర్ఘటనలకు గురవుతున్నారని వారు వాపోయారు. రైతులకు కనీస భద్రతా చర్యలు లేకపోవడం బాధాకరమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ, "ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన యూరియాను విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ముదిరే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. పంటకాలంలో యూరియా కొరత ఉంటే రైతులే కాదు, ఆహార భద్రత కూడా సంకటంలో పడుతుందని వారు పేర్కొన్నారు.



## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

**వలిగొండ, విశాలభారతి:**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలోని స్వర్ణకారుల సంఘం భవనంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు దాసోజు విఠలచారి ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విఠలచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారులను ఆదుకోవాలని కోరారు. పద్మశాలీలు, గౌడ కులస్తులకు 50 ఏళ్ల వయసు నిండగానే అందించే పింఛన్లు స్వర్ణకారులకు కూడా ఇవ్వాలని, అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్వర్ణకారులకూ గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ డిమాండ్లను పరిష్కరించి స్వర్ణకారుల కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోల్లోజు రఘు చారి, గౌరవ అధ్యక్షులు చిట్టోజు వెంకటనారాయణ చారి, ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రీనివాసాచారి, కోశాధికారి చిట్టోజు సత్యనారాయణ చారి తదితరులు పాల్గొన్నారు. అలాగే సభ్యులు కన్నెకంటి స్వామి చారి, లక్ష్మణ చారి, విష్ణు శ్రీనివాస చారి, ప్రసాద్ చారి, దాసోజు జనార్ధన్ చారి, దాసోజు వెంకటేశ్వర చారి, చిట్టోజు నరసింహ చారి, ఇటికాల నరసింహ చారి, కోల్లోజు విష్ణు చారి, నారోజు సత్యనారాయణ చారి, కొండపర్తి చంద్రమౌళి చారి, ఉప్పల నరసింహ చారి తదితరులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

## తెలంగాణ పోరాటానికి చరిత్రలో ప్రత్యేకస్థానం

**అమరావతి:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.. తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. భారత దేశం 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందినా.. ఆ ఫలాలు పొందటానికి తెలంగాణ ప్రజలకు మరో 13 నెలలు సమయంపట్టిందని గుర్తుచేశారు.. నిజాం నిరంకుశ పాలనపై భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో సాగిన పోలీస్ యాక్షన్ మూలంగా తెలంగాణకు స్వేచ్ఛ దక్కి విమోచన కలిగిందని చెప్పుకొచ్చారు.. ఈ రోజు తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు పవన్ కల్యాణ్... ఇక, నిజాం ఏలుబడిలో రజాకార్లు ఊళ్ల మీదపడి సాగించిన అకృత్యాల వల్ల ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది.. దానికి వ్యతిరేకంగా.. రజాకార్లపై రైతాంగం చేసిన సాయుధ పోరాటానికి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు పవన్ కల్యాణ్.. రజాకార్లు చెలరేగిన తీరు, వారికి నాయకత్వం వహించిన కాసీమ్ రజ్వీ.. ఢిల్లీ ఎర్రకోటపై అసఫ్ జాహీ పతాకాన్ని ఎగురవేస్తానని విర్రవీగిన విధానం... వల్లభాయ్ పటేల్ ఏ విధంగా కట్టడి చేసింది.. ఈ తరానికి తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు.. నిజాం పాలనపై రైతులు, సామాన్య ప్రజలు చేసిన పోరాటం తాలూకు స్ఫూర్తి

# గవర్నర్ వ్యవస్థ రద్దు చేయడం మేలు

ఇటీవల సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో గవర్నర్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. వారు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని పలు రాష్ట్రాల సిఎంలు కూడా అభ్యంతరాలు తెలిపారు. అలాంటి ఉదాహరణలు మన కళ్లముందు అనేకం ఉన్నాయి. ఇవన్నీకూడా కాంగ్రెస్ హయాంలోనే ఎక్కువగా జరిగాయి. కేరళలో నంబూద్రిపాద్ ప్రభుత్వం రద్దుతో మొదలైన రగడ వివిధ రూపాల్లో సాగుతోంది. మొన్నటికి మొన్న తమిళనాడు గవర్నర్ రవి వ్యవహారంతో పరాకాష్టకు చేరి సుప్రీం మందలించే వరకు వెళ్లింది. ఈ క్రమంలో దేశానికి భారంగా మారిన ఈ వ్యవస్థనురద్దు చేసుకోవడం మంచిదే. మారుతున్న కాలం, అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగ సవరణలు చేసుకుంటున్న మనం ఇప్పుడు గవర్నర్ వ్యవస్థను రద్దు చేసుకోవడం ఉత్తమం. దీంతో ఖజానాలపై భారం కూడా తగ్గుతుంది. అనేక రాష్ట్రాల్లో గవర్నర్లు కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా రాజకీయాలు చేస్తున్న తీరు వ్యవస్థను నిర్వీర్య పరిచేలా ఉన్నాయి. బెంగాల్లో తీవ్ర వివాదానికి గురైన ధన్‌కడ్ ఉపరాష్ట్రపతి అయ్యారు. ఇప్పుడాయన రాజీనామా కూడా చేశారు. గతంలో తెలంగాణ గవర్నర్ తమిళ సై కూడా రాజకీయాలతో కాలక్షేపం చేస్తున్నారు. కేరళ గవర్నర్‌గా అరీఫ్ మహ్మద్ పరిస్థితి కూడా ఇంచుమించుగా ఇలాగే ఉండేది. కేరళలో నంబూద్రిపాద్ సిఎంగా ఉన్న సమయం నుంచి అనేక రాష్ట్రాల్లో గవర్నర్ల వ్యవస్థను కాంగ్రెస్ భ్రష్టుపట్టించింది. యూపిలో గతంలో జగదాంబికాపాల్‌ను సీట్లో కూర్చుండబెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే. ఉమ్మడి ఎపిలో గవర్నర్ రామ్‌లాల్ ఆనాటి సిఎం ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించి ఛీత్కారానికి గురయ్యారు. ఉమ్మడి ఎపిలో నాదెండ్ల భాస్కర్ రావును సిఎం చేయడం కోసం గవర్నర్ రామ్‌లాల్ ఎలా వ్యవహరించారో చెప్పాలి.అన్యాయంగా ఎన్టీఆర్‌ను పదవీచ్యు తుడిని చేస్తే వందిమాగధుల్లా కమ్యూనిస్టులు వ్యవహరించారు. బాబును భుజాని కెత్తుకున్నారు. ఆనాటి గవర్నర్ కృష్ణకాంత్ తీరును ఎందుకు తప్పుపట్టలేక పోయారో చెప్పలేదు. కనీసం పశ్చాత్తాపం కూడా ప్రకటించలేదు. ఎందుకు ఎన్టీఆర్‌ను ఆనాడు పదవీచ్యుతిడిని చేశారో చెప్పాలి. అలాగే ఎన్టీఆర్‌ను బర్తరఫ్ చేసి చంద్రబాబును ఎందుకు సిఎం చేశారో, అందుకు కమ్యూనిస్టులు ఎందుకు వత్తాసు పలికారో చెప్పాలి. ఆనాడు విలువలు మరచిపోయిన నేతలు విలువల గురించి మాట్లాడుతున్నారు. ప్రధానంగా బిజెపి కేంద్రంలో అధికారంలో ఉండడం, రాజకీయ నేపథ్యం కలిగిన వారు గవర్నర్లుగా ఉండడం వివాదాలకు కారణం అవుతోంది. అయితే ఇది కాంగ్రెస్ హయాంలోనే పురుడు పోసుకుంది. గవర్నర్ వ్యవస్థను భ్రష్టు పట్టించిందే కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు దానిని బిజెపి కూడా కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా పలువురు నేతలు గవర్నర్ వ్యవస్థపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానిని తొలగించాలన్న డిమాండ్ చేస్తున్నారు. సుప్రీం కోర్టు కూడా బిల్లుల ఆమోదంలో గవర్నర్ల పాత్రను తప్పుపట్టింది. వారు బిల్లులను తొక్కిపెట్టి ఇష్టానుసారంగా వ్యవహరించడం పై ఆగ్రహం వ్యక్తం చేసింది. నిజానికి దివంగత సిఎం ఎన్టీఆర్ ఆనాడే గవర్నర్ వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించారు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ క్రమంలో మోడీ రాజకీయ సంస్కరణలపైనా దృష్టి సారించాల్సి ఉంది. ప్రధానంగా గవర్నర్ వ్యవస్థపై దృష్టి సారించాలి. ఎందుకంటే ఇది దేశానికి ఆర్థిక భారంగా మారింది. ప్రజల సొమ్ముతో ఈ వ్యవస్థ వల్ల ఏటా వందల కోట్ల రూపాయలు వృథా అవుతు న్నాయి. జీతభత్యాలు, పర్యటనలు తదితర ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. దీనికితోడు రాజకీయాలకు రాజ్‌భవన్‌లు వేదికగా మారుతున్నాయి. అలాగే రాజకీయ పునరావాస కేంద్రాలకు కారణమవుతున్నాయి. పదవులు దక్కని వారంతగా గవర్నర్లుగా మారుతు న్నారు. అందువల్ల తక్షణం దీనిని రద్దు చేస్తే దేశానికి, ఆర్థిక రంగానికి మేలు చేసిన వారు అవుతారు. ఏ విధంగా గవర్నర్ వ్యస్థను ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిర పరిచారో చూశాం. గవర్నర్ల వ్యవస్థ అనవసరమని అనుకుంటున్న తరుణంలో వారంతా రాజ్యాంగ విరుద్దంగా ప్రవర్తిస్తున్నారు. గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాల్సిన అవసరం ఉందని ఇటీవలి వరుస ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఇన్నాళ్లూ కాంగ్రెస్ పార్టీ గవర్నర్ల వ్యవస్థను అపహాస్యం చేసింది. ఇష్టారాజ్యంగా వాడుకుంది. రాజ్‌భవన్లను ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయాలుగా వాడుకుంది. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఇవాళ విలువలు, రాజ్యాంగం గురించి మాట్లాడడం విడ్డూరం కాక మరోటి కాదు. వ్యవస్థలను నిర్వీర్యం చేసి, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోయింది. అది చేసిన పాపాలకు దానిని ఎన్నిసార్లు పాతరేసినా పరిహారం తీరదు. మోడీ నేతృత్వం లోని బిజెపి కూడా కాంగ్రెస్ బాటలోనే నడవదన్న సంకేతాలు ఇచ్చినా, రాష్ట్రాల్లో పట్టుకోసం గవర్నర్లను వాడుకుంటోంది. అలాంటప్పుడు ఓ పక్కా వ్యవస్థను నిర్మించుకోవాల్సి ఉంది. రాజ్యాంగంలో మార్పులు చేసుకుని సక్రమంగా నడుచుకుని కోర్టుల ప్రమేయం లేకుండా సాగాలి. అధికార సాధనే తప్ప, ప్రజల బాగోగులు ఏమాత్రం పట్టని నేతలు, పార్టీలు అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం పరిహాసమయ్యే తీరుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య సంధానకర్తలుగా నిలిచి సమాఖ్య వ్యవస్థ బలపడేలా చూడాల్సిన గవర్నర్ల వ్యవస్థను స్వార్థ ప్రయోజనాల కోసం పాలక పార్టీలు బలి చేసిన తీరును దేశ ప్రజానీకం అసహ్యించుకుంటోంది. గతంలో మణిపూర్, గోవా, మేఘాలయల్లోఅత్యధిక సీట్లను పొందిన పార్టీలను కాదని అడ్డదోవన బిజెపి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఇప్పుడదే విధానం అమలు చేయాలని అంటున్న వారు గతంలో ఎలా నడిచారన్నది చూసుకోవడం లేదు. నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత కొన్ని సందర్భాల్లో కాంగ్రెస్ గతంలో అనుసరించిన విధానాలనే పాటిస్తున్నారు. ఎప్పటికి ఏది అవసరమో దానిని ఆచరిస్తున్నారు. కాంగ్రెస్ లాగానే తన అస్మదీయులను, తాబేదార్లను అనేక రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారు గవర్నర్లుగా నియమితులై ఆ పార్టీకి అనుకూలంగా రాజకీయాలు నెరిపారు. అవన్నీ మరచిపోయి ఇప్పుడు విమర్శలు చేసే వారు గతాన్ని తవ్వితీయాలి. గతమంతా కరెక్టా కాదా అన్న వివేచన లేకుండా ఇప్పుడు జరిగిందే తప్పు అని అనడానికి లేదు. నిజానికి ఇదంతా వ్యవస్థీకృతంగా ఉన్న లోపం. దీనిపై చర్చించాలి. రాజ్యాంగంలో మార్పులు చేసుకోవాలి. మొత్తంగా ఆరోవేలుగా ఉన్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ఒక్కటే పరిష్కారం కాగలదు. అందుకు ఇదే తగిన సమయం. ప్రజలకు కూడా అక్కర్లేని గవర్నర్

# 140 కోట్ల మందికి ప్రయోజనం కలిగేలా జిఎస్టీ

### జిఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతికి ఊరట

### ముఖ్యంగా వ్యవసాయరంగంపై భారీ ఓదార్పు

### ఉప్పులు, పప్పులు,సబ్బులవంటి నిత్యావసరాల ధరలు తగ్గుదల

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి




**విశాఖపట్నం:** దేశంలోని 140 కోట్ల మందికి వర్తించే విధంగా జీఎస్టీపై పెద్ద నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు ఈనెల 22 నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు. విశాఖపట్నంలోని మధురవాడలో జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయరంగానికి ఎంతో మేలు చేకూర నుందని అన్నారు. రైతులకు మేలు చేసే విషయంలో నష్టమైనా ఫర్వాలేదని ప్రధాని మోడీ పట్టుబట్టారని అన్నారు. ఇప్పటికే అనేక రంగాల్లో జీఎస్టీ ప్రయోజనాలు చేకూరాయి. నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబ్‌లకు తగ్గించాం. 12 శాతంలో ఉండే వస్తువులు దాదాపు 99 శాతం 5 శాతం శ్లాబ్ పరిధిలోకి తీసుకొచ్చాం. 28 శాతం శ్లాబ్‌లో ఉండే సిమెంట్ సహా 90 శాతం వస్తువులు 18 శాతం శ్లాబ్ పరిధిలోకి తెచ్చాం. 2017కు ముందు 17 రకాల పన్నులు ఉండేవి.. వాటిపై 8 సెస్సులు కూడా ఉండేవి. ఉదాహరణకు 2017కు ముందు సబ్బు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేది. అన్నింటినీ కలిపి దేశవ్యాప్తంగా ఒకే పన్ను.. నాలుగు శ్లాబ్‌ల రూపంలో తీసుకొచ్చిందే జీఎస్టీ అని అన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ద్వారా రూ.7.19లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ప్రజలపై భారం తగ్గించేందుకే జీఎస్టీ తీసుకొచ్చాం. పాలు, పెరుగు సహా పలు నిత్యావసరాలను 5 శాతం శ్లాబ్ నుంచి సున్నా శాతానికి తీసుకొచ్చాం. మధ్యతరగతికి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకున్నాం. కారు, ఫ్రిజ్, ఏసీని 28 శాతం నుంచి 18 శాతానికి తీసుకొచ్చాం. ఆత్మనిర్భర్ భారత్‌కు జీఎస్టీ నూతన సంస్కరణలు పెద్ద ఊతం. మహిళల ఆరోగ్యం కోసం శానిటరీ న్యాప్‌కిన్స్‌పై పన్నును సున్నా చేశాం. యూపీఏ ప్రభుత్వంలో 30 శాతం ఉన్న వస్తువులను ఇప్పుడు 5 శాతానికి తెచ్చాం. సరళతరమైన పన్ను విధానాన్ని తీసుకురాలేని వాళ్లు ఇప్పుడు విమర్శలు చేస్తారా? గతంలో 65 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉండేవాళ్లు. ఈ 8 ఏళ్లలో ఆ సంఖ్య 1.51 కోట్లకు చేరిందని నిర్మలా సీతారామన్ వివరించారు. ఇప్పటికే అనేక రంగాల్లో జిఎస్టి ప్రయోజనాలు చేకూరాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జిఎస్టి స్లాబులను నాలుగు నుంచి రెండుకు తగ్గించామని అన్నారు.అన్నింటినీ కలిపి ఒకే పన్ను, నాలుగు స్లాబ్ లుగా తీసుకొచ్చిందే జిఎస్టి అని తెలియజేశారు. 2017 కు ముందు సబ్బు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేదని, 2017 కు ముందు 65 లక్షల మంది పన్ను చెల్లించే వారని అన్నారు. ఈ 8 ఏళ్లలో పన్ను చెల్లింపు దారులు 1.51 కోట్లకు చేరారని, 2018 లో జిఎస్టి ద్వారా రూ. 7.19 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని కొనియాడారు. 2025 లో జిఎస్టి ద్వారా రూ. 22.08 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని, ప్రజలపై భారం తగ్గించేందుకే జిఎస్టి తీసుకొచ్చామని అన్నారు. వెన్న, నెయ్యి, వంటపాత్రలను 12 నుంచి 5 శాతానికి, పప్పులు, చింతపండు, ఉప్పును తెచ్చామని, హెయిర్ ఆయిల్, షాంపును 18 నుంచి 5 శాతానికి తీసుకొచ్చామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మధ్యతరగతి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకున్నామని, కారు, ఫ్రిజ్, ఎసిని 28 శాతానికి తీసుకొచ్చామని చెప్పారు. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్పులు చేశామని, పురుగులమందులు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను దృష్టిలో పెట్టు-కున్నామని అన్నారు. సులభమైన పన్ను విధానం తేలేని వారు ఇప్పుడు మమ్మల్ని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. యూపిఎ హయాంలో 30 శాతం పన్ను ఉన్న వాటిని 5 శాతానికి తెచ్చామని, మహిళల శానిటరీ న్యాప్ కిన్స్ పై పూర్తిగా పన్ను తొలగించామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నవరాత్రులు ప్రారంభం నుంచే కొత్త జీఎస్టీ విధానం పని చేస్తుంది అని తెలియజేసింది. విస్తృతమైన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు అమలు చేయడం జరుగుతుంది అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించింది. గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని అక్షేపించినా వినియోగదారులకు అంతిమంగా మేలు జరుగుతుంది.. వన్ నేషన్- వన్ ట్యాక్స్ విధానానికి జీఎస్టీ కౌన్సిల్ ఫెడరల్ వ్యవస్థగా మారింది.. న్యూజెన్ ట్యాక్స్ వల్ల రెండ లక్షల కోట్ల వరకు ప్రజల చేతుల్లో నగదు ఉంటుంది.. పప్పులు, ఉప్పులు సహా అన్నీ 5 శాతం పరిధిలోకి వచ్చేశాయ్ అని వెల్లడించింది. స్థూలంగా మధ్య తరగతికి మేలు చేసే విధంగా రూపొందించాం.. పేద, మధ్య తరగతి, రైతులు, దేశానికి ఉపయోగమైన సెక్టార్స్ ను పిల్లర్స్ గా పెట్టు-కుని జీఎస్టీ రూపకల్పన జరిగింది అని కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ పేర్కొనింది. ఇక, 144 వందే భారత్ రైళ్లు, 60 శాతం కంటే ఎక్కువ హైవేలు, విమానాశ్రయాలు రెట్టింపుతో పాటు- సంక్షేమ పథకాలు, రక్షణ వ్యవస్థ బలోపేతం ఇవన్నీ జీఎస్టీ సొమ్ముతోనే చేశామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. మన డబ్బుని సరిగ్గా వినియోగించే ప్రభుత్వం మనకి కావాలి.. డీబీటీల ద్వారా రూ.3 లక్షల కోట్లు- బోగస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ఆదా చేశాం.. జీఎస్టీ 2.0 తీసుకొస్తే ఎనిమిదేళ్లు ప్రజల నుంచి భారీగా పన్నులు వసూలు చేసినట్లు- ఒప్పుకుంటున్నారా అని ప్రతిపక్షాలు మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళు జీఎస్టీని తీసుకురాకుండా కాలయాపన చేసిన యూపీఏ ప్రభుత్వానికి జీఎస్టీపై మాట్లాడే అర్హత లేదు అన్నారు. వాళ్ల గురించి మాట్లాడాలంటే బూతులొస్తున్నాయి.. రాజకీయంగా బదులిచ్చేందుకు సమయం ఉంది.. ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్లపై యూపీఏ ప్రభుత్వంలో 30 శాతం ఉంటే ఇప్పుడు 18 శాతానికి తగ్గిందని నిర్మలా సీతారామన్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.